18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
బుధవారం | 2 అక్టోబర్ 2024 | పేజీలు 11

# ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఘన స్వాగతం



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయితీ రాజ్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు తదితర అధికారులు పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గం చేరుకున్నారు. వీరికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితర అధికారులు ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. కాలి నడకన ఉప ముఖ్యమంత్రి రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రికి తిరుమలలో బస చేస్తారు. అక్టోబర్ 2న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం 11.05 గంటలకు తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. బుధవారం రాత్రి కూడా తిరుమలలోనే బస చేస్తారు. అక్టోబర్ 3న సా.4.30 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతిలో జరగనున్న వారాహి సభ కార్యక్రమంలో పాల్గొని రా.8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ తిరుగుప్రయాణం కానున్నారు.

# పచ్చదనంపై గొడ్డలి వేటు



- అనుమతులు లేకుండా చెరువులో అక్రమంగా చెట్లు నరికివేత
- లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు
- దశాబ్దాల నాటి చెట్లు కనుమరుగు

**ఓజిలి, మేజర్‌న్యూస్:** మొక్కలు నాటండి. పర్యావరణాన్ని కాపాడండంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే అధికారులు మాత్రం వాటిని పెడచెవిన పెడుతున్నారు. ప్రకృతిని కాపాడా దెవరు అన్న సందేహం కలుగు తుంది. మండ లంలోని ఆచర్లపార్లపల్లి చెరువు పచ్చదనంపై గొడ్డలివేటు వేయడాన్ని పర్యావరణ ప్రేమికులు జీర్ణించుకోలేకపోతున్నారు. పచ్చని చెట్లను నిలువునా కూల్చేస్తున్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అంటూ ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతుంటే.. ఇటు కొందరు అధి కారుల నిర్లక్ష్యం మూలాన పచ్చని చెట్లపై గొడ్డలివేటు పడుతోంది. ఎన్నో ఏళ్లుగా పెంచిన చెట్లను మొదళ్ల కాడికి నరికివేయడంతో చెరు వులు బోరున విలపిస్తున్నాయి. ఒక పక్క ప్రభుత్వం పచ్చతోరణం పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటించి వాటిని పెంచే బాధ్యతను కూడా అధికారులు, ప్రజాప్రతినిధులకు అప్పగి స్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులే అనేక చోట్ల పచ్చతోరణం పేరుతో ఆర్భాటంగా మొక్కలు నాటారు. అయితే అవి ఎంత వరకు ఉపయోగపడుతాయనే ఆలోచనలు ఉండటంలేదు. ప్రభుత్వంలో వివిధ శాఖల మధ్య సమన్వయం లేకుండా పనిచేస్తున్నాయనేందుకు నిదర్శనం. ఓజిలి మండలంలోని ఆచార్ల పార్లపల్లి

మిగతా 2లో

# పండుగల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ మంగళవారం పండుగ వాతావరణంలో జరిగింది. ఉదయం 6 గం.ల నుండి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో 2,66,342 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా రూ.112.71 కోట్ల పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు నగరంలోని అక్కారం పల్లి, సుబ్బారెడ్డి నగర్ నందు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ నారపరెడ్డి మౌర్య పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతి నెల సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ప్రతి నెలా 1వ తేదీన సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజల ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పింఛన్ అందుకున్న లబ్దిదారులు 1వ తేదీన క్రమం తప్పకుండా పింఛన్ అందు తోందని ఆలస్యం లేకుండా పెన్షన్ పంపిణీ చేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పలునియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సచివాల యం సిబ్బందితో కలిసి ఉదయం నుండి పెన్షన్లు పంపిణీ చేశారన్నారు. ఏదేని కారణం చేత పెన్షన్ల తీసుకోలేని వారికి అక్టోబర్ 3వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని, తప్పకుండా వారు వారి ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు.



## తిరుమలకు మెట్లు మార్గాన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి దర్శనానికి అలిపిరి మెట్లుమార్గాన డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్ మంగళవారం పయనమయ్యారు. శ్రీవారిని దర్శనంచేసుకున్న అనంతరం వెంగమాంబ అన్నదానకేంద్రాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించను న్నారు. సుప్రీం కోర్టు కల్తీ నెయ్యిపై ఘాటువ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తారోనని వేచి ఉన్నారు.

## ఘర్షణలో నష్టపోయిన 54 మందికి రూ.5.32 లక్షల చెక్కు పంపిణీ

- వి.కోటలో ప్రజలు మత సామరస్యంతో మెలగాలి
- శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు... జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- మూడు రాష్ట్రాల సరిహద్దు సాంప్రదాయ సమ్మేళనం వి.కోట
- వి.కోటలో ప్రజలు మత సామరస్యంతో అన్నదమ్ముల్లా కలిసి ఉండేవాళ్లం
- భవిష్యత్తులో అదే భావనతో కలసి ఉండాలి పలమనేరు ఎమ్మెల్యే

**వి.కోట, మేజర్‌న్యూస్:** వి.కోటలో గతనెల2న జరిగిన ఘర్షణలో నష్టపోయిన వ్యాపారస్థులకు నష్టపరిహారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. నష్టపోయిన 54 మంది కాయ గూరలు, పండ్లవ్యాపారస్థులకు రూ.5.32లక్షల చెక్కును మంగళవారం వి.కోట ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమరనాథరెడ్డిలు, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నష్టపరిహార దాత వి.కోట యాక్ట్స్ సంస్థ అధినేత దశరథరెడ్డితో కలసి అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దురదృష్టవశాత్తు సెప్టెంబర్ 2న వి.కోటలో జరిగిన ఘర్షణలో దాదాపు 54మంది కాయగూరలు, పండ్లు, ఇతర వ్యాపారస్తులు నష్టపోయారని,వీరికి జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయడం జరిగిందన్నారు. మొత్తం నష్టపరిహారంను రూ.5.32 లక్షలుగా నిర్ధారించి పంపిణీ చేయడం జరిగిందన్నారు. నష్టపరిహారం మొత్తంను వి.కోట యాక్ట్స్ సంస్థ అధినేత దశరథరెడ్డి సేవాభావంతో చెల్లించడానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. అధికారుల ద్వారా చేపట్టిన నష్టపరిహారం అంచనాలలో అసంతృప్తి ఉన్నట్లయితే వారి వినతులను తహశీల్దార్‌కు సమర్పించినట్లైతే పునఃసమీక్షించడం




మిగతా 2లో

## తుమ్మలగుంటలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాలకు ముందుగా ఆలయంలో జరిగే ప్రధాన క్రతువు



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 3వ తేది నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో స్వామి వారి గర్భాలయంతో పాటు ప్రధాన ఆలయం మొత్తం శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వివరాలు 2లో

# విజయం విద్యాసంస్థలో ముందస్తు దసరా, గాంధీ జయంతి వేడుకలు

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరంలోని స్థానిక సుందర రాజపురం విజయం సి.బీ.యస్.ఇ పాఠశాల నందు ముందస్తు దసరా పండుగను పురస్కరించుకొని ఘనంగా దుర్గా పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని, నవదుర్గ వేషధారణలు, దసరా పద్యాలు, నృత్య, సంగీతాలతో అలరించారు. కార్యక్రమంలో ముఖ్యంగా మహిషాసురమర్దిని నృత్య నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి ప్రసంగిస్తూ "స్త్రీలు అర్ధరాత్రి ఒంటరిగా, నిర్భయంగా తిరగాడిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని మహాత్మ గాంధీ మాటలని గుర్తుచేశారు. అనంతరం పాఠశాల డైరక్టర్ శైలజమూర్తి మాట్లాడుతూ నేటి రోజుల్లో స్త్రీలు అనేక రంగాలలో రాణిస్తున్నారని, కొందరు అనాగరికంగా ప్రవర్తించిన వాటిని ఎదుర్కొని ఆ అమ్మవారి ఆదర్శంతో, ఆశీస్సులతో స్త్రీలు విజయం వైపు ముందడుగు వేయాలని" విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు యం.బి కౌసల్య మాట్లాడుతూ అందరికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, అందరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించాలని ఆదే విధంగా అక్టోబర్2 గాంధీ జయంతిని పురస్కరించుకుని అందరూ గాంధీజీ అడుగు జాడల్లో నడవాలని, సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గణనాథుని హుండీ ఆదాయం రూ.2కోట్లు

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ వరసిద్ది వినాయకస్వామి వారి హుండీ కానుకలను స్వామివారి ఆస్థాన మండపంలో మంగళవారం ఉదయం లెక్కించగా రూ. 2,15,30,322లు ఆదాయం వచ్చినట్లుఆలయ ఈవో పట్టేం గురుప్రసాద్ తెలిపారు.అందులో బంగారు 90 గ్రాములు, వెండి ,1 కేజీ 295 గ్రాములు ,గో సంరక్షణ హుండీ ద్వారా 29,513 రూపాయలు, నిత్య అన్నదాన పథకం ద్వారా 44,159, వేల రూపాయలు, స్వామివారి భిక్షాడి హుండీ ద్వారా18,212 రూపాయలు, యుఎస్ఏ 947, డాలర్లు, యుఎఇ 120 ధీరామ్స్, మలేషియా 406,రింగ్ట్స్, ఈయూరో150, ఇంగ్లాండ్ 55 పౌండ్స్ , ఆస్ట్రేలియా10, డాలర్స్ మలేషియా 406 రింగ్ట్స్, వంటి ఆదాయం23 రోజులకు వచ్చినట్లు ఈవో వివరించారు.



ఈహుండీ లెక్కింపు కార్యక్రమంలో ఎఈఓలు రవీంద్ర బాబు,విద్యాసాగర్ రెడ్డి, ఎస్వీ కృష్ణా రెడ్డి, హరి మాధవ రెడ్డి,పర్యవేక్షకులు బాలరంగస్వామి, సిఎఫ్ఓ నాగేశ్వర్‌రావు, కోదండపాణి, శ్రీధర్ బాబు, బాలరంగ స్వామి మల్లికార్జున, హుండీ ఇన్ స్పెక్టర్,సుబ్రమణ్యం నాయుడు, సేవకులు, ఆలయ సిబ్బంది తోపాటు కాణిపాకం యూనియన్ బ్యాంక్ శాఖ అధికార్లు పాల్గొన్నారని ఆలయ ఈఓ పట్టేం గురుప్రసాద్ పేర్కొన్నారు.

# గరుడ సేవకు విచ్చేసే భక్తుల సౌకర్యాలపై సమీక్ష

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అక్టోబరు 8న జరిగే గరుడసేవకు లక్షలాదిగా విచ్చేసే భక్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లు చేయాలని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం అదనపు ఈఓ గరుడ సేవ ఏర్పాటపై సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా వాహనముల ముందు ప్రదర్శించే వివిధ రాష్ట్రాలకు చెందిన సాంస్కృతిక బృందాల ప్రదర్శనలకు సంబంధించిన వీడియోను అదనపు ఈఓ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.తర్వాత ఆయన అన్నప్రసాదం విభాగం రూపొందించిన నాలుగు మాడ వీధులలో అన్న ప్రసాద వితరణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను కూడా అధ్యయనం చేశారు. ఇందులో అన్నప్రసాదాల తయారీ, పంపిణీ మార్గాలు మరియు గ్యాలరీలలో ఉన్న భక్తులకు సజావుగా అన్నప్రసాదాలు పంపిణీ అయ్యేలా ఇతర విభాగాలతో సమన్వయం చేయడం వంటివి ఉన్నాయి.ఈ సమావేశంలో రవాణా శాఖ జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, హెచ్‌డీపీపీ, విజిలెన్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# పచ్చదనంపై గొడ్డలి వేటు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లోని చెరువుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు లక్షల రూపాయలు విలువచేసే చెట్లను నరికివేసి అక్రమ రవాణా చేసి లక్షల పోగేసుకుంటున్నారు. అక్రమ రవాణాదారులు చెట్లు సరికివేసిరవాణాను మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ రవాణా చేస్తూతరలించుకుపోతున్నారు. వాతావరణం కలుషితం కాకుండా మానావాళిని కాపాడుతున్న పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. యథేచ్ఛగా లక్షల రూపాయలు విలువ చేసే సంపదను తరలిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణులకు నీడనిచ్చే సంపద, చెట్లు కనుమరుగు అవుతున్నాయి. విపరీతంగా చెట్లను నరికివేయడంతో వాతావరణ సమతుల్యం దెబ్బతిని, వర్షాలు కురవక కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంటుందని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. చెరువుల చెట్లు కనుమరుగు అవడంతో



వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా చెట్లు నరికేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజల కోరుతున్నారు.

# ఘర్షణలో నష్టపోయిన 54 మందికి రూ.5.32 లక్షల చెక్కు పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. ప్రస్తుతం వి.కోటలో ప్రజలు మత సామరస్యం ఉన్నారని, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రజాప్రతినిధులు సహకారం అందించారన్నారు. పలమనేరు ఎంఎల్ఏ మాట్లాడుతూ వి.కోటలో ప్రజలు మత సామరస్యంతో అన్నదమ్ముల్లలా కలిసి ఉండేవాళ్ళమని, భవిష్యత్తులో అదే భావనతో కలసి ఉండాలన్నారు. గతంలో వి.కోటలో జరిగిన సంఘటనలో కొంత మంది పండ్ల, కాయగూరల, ఇతర వ్యాపారస్తులు తమ ప్రమేయం లేకుండా నష్టపోయారని అన్నారు. వీరికి నష్టపరిహారం అందిస్తున్న దాతకు తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వి.కోట ప్రాంతం మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమని, ఈ ప్రాంతంలో మూడు రాష్ట్రాల సాంప్రదాయం మిళితమై ఉంటుందన్నారు. రానున్న భవిష్యత్ తరాల బాగు కోసం సమాజానికి హాని కలిగించే సమస్యలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. నష్టపోయిన వారికి అండగా ప్రభుత్వం ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యేగా భాద్యత తనపై ఉందని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2న వి.కోటలో జరిగిన దురదృష్టకర సంఘటనను మరచి మత సామరస్యంతో వినాయకచవితి, మిలాద్ ఉన్ నబి పండగలు చేసుకున్నామని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో అన్నదమ్ముళ్ళగా కలిసి ఉండాలన్నారు. ఘర్షణలో నష్టపోయిన వారిని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గుర్తించి నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. వి.కోట యాక్ట్స్ సంస్థ అధినేత మాట్లాడుతూ వి.కోట తనకు జన్మనిచ్చిన ఊరు అని, అలాంటి ఊరికి సమస్యవస్తే తప్పకుండా సహాయం చేస్తానన్నారు. వి.కోటలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని, వారందరూ తనకు సోదర సమానులని, నష్టపోయిన వారికి పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వం తరపున సహాయం అందించడానికి ముందుకు రావడం వచ్చానని, ఇంకా నష్టపరిహారం అందని వారు ఎవరైనా ఉన్నట్లయితే వారికి కూడా సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పార్వతి, ఎంపిడిఓ మహ్మద్ రఫి, రాంబాబు నాయుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తుమ్మలగుంటలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 3వ తేది నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో స్వామి వారి గర్భాలయంతో పాటు ప్రధాన ఆలయం మొత్తం శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాదిలో నాలుగు సార్లు ఆలయ శుద్ధి కార్యక్రమం చేస్తారు దీనినే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటారు. ఆలయంలోని గోపురం మొదలుకొని ప్రధాన వాకిలి వరకు, గర్భాలయం నుంచి ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని రకాల వస్తువులను శుభ్రం చేశారు. శుద్ధి అనంతరం పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా సంప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి వారి మూల విరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన తరువాత స్వామి వారి దర్శనానికి భక్తులను యదావిధిగా అనుమతించారు.

**కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటే...** తమిళంలో కోయిల్ అంటే 'పవిత్ర పుణ్యక్షేత్రం', ఆళ్వార్ అంటే "భక్తుడు", తిరు అంటే "శ్రేష్ఠం", మంజనం అంటే "స్నానం". కోయిల్ ఆల్వార్ తిరుమంజనం అంటే గర్భగుడి మరియు ఆలయ ప్రాంగణాన్ని భక్తులు శుద్ధి చేసే కార్యక్రమం అని అర్థం. ఈ సమయంలో అన్ని దేవతా మూర్తులను మరియు ఇతర వస్తువులను గర్భగుడి నుండి బయటికి తెచ్చి, కర్పూరం, గంధం, కుంకుమ, పసుపు, కిచ్చిలి గడ్డ మొదలైన వాటితో కూడిన "పరిమళం" అనే సుగంధ మిశ్రమంతో శుభ్రం చేస్తారు. శ్రీవారి ప్రధాన మూర్తికి కూడా ఒక తెల్లని వస్త్రాన్ని కప్పి ఉంచుతారు. ఈ మొత్తం కార్యాచరణ ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఒక మహోయజ్ఞం లా జరుగుతుంది. తర్వాత ప్రధాన దేవతపై ఉన్న వస్త్రాన్ని తొలగించి, లోపల దేవతలు, దీపం మరియు ఇతర పూజ వస్తువులను మరల లోనికి తీసుకొస్తారు . అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పిస్తారు. ఈ యావత్ కార్యక్రమం ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించబడుతుంది. ఒక సంవత్సరానికి నాలుగు సార్లు ఈ వైదిక కార్యక్రమం నిర్వహిస్తారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి మరియు వార్షిక బ్రహ్మోత్సవాలు ముందు వచ్చే మంగళవారం నాడు ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ.

**బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...** ఈనెల 3వతేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన ఆలయంతో పాటు తుమ్మలగుంట పరిసరాల్లో స్వాగత తోరణాలు, విద్యుత్తు దీపాలతో కూడిన దశావతారాల భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామంలో స్వామి వారి వాహన సేవలు తిరిగే అన్ని ప్రధాన రహదారుల్లో రంగవల్లులు ఏర్పాటు చేసి అందందగా తయారు చేశారు. స్వామి వారి వాహన సేవలకు హారతులు అందించే ప్రదేశాల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గత 16ఏళ్లుగా బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా పూర్తి చేసిన అనుభవంతో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పూర్తి చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బ్రహ్మోత్సవ ఏర్పాట్లుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉత్సవాలు విజయవంతం కావడానికి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కళాకారులు, భజన బృందాల వారికి భోజనం, వసతి సదుపాయాలతో పాటు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయించారు.



## పద్మావతి అమ్మవారి సేవలో డీజీపీ



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికి దర్శన్ ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం వేద ఆశీర్వాదం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పోలీస్ అధికారులు, బిజెపి నాయకులు జల్లి మధుసూదన్ పాల్గొన్నారు.

## ఘంటసాలకు పాలాభిషేకం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఘంటసాల ఘన మాధుర్యంతో ఆయన ప్రజల గుండెల్లో



స్థిరస్థాయిగా నిలిచారని గుండాల గోపీనాథ్ రెడ్డి కొని యాడారు. ప్రతినెల ఒకటో తేదీన ఘంటసాలకు పాలాభిషేకం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళవారం రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మధుర గాయ కులు ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల అభిమాని కృష్ణ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు కొట్టే సుబ్ర మణ్యం, భాస్కర్ చిత్రపు హనుమంతరావు కృష్ణమూర్తి, టీచర్ తిరుమలయ్య, సుబ్రమణ్యం రెడ్డి, విరుపాక్షి కుమార్ రెడ్డి, ఆదిస్వామి, చంద్ర శేఖర్ రెడ్డి, కస్మ పద్మనాభం పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ వారాహి సభను విజయవంతం చేయండి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని స్థానిక కార్యాలయంలో జనసేన నాయకులు



ఏర్పాటుచేసిన సమావేశంలో పగడాల రమణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ షెడ్యూల్‌ను వివరించారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకుని 5 గంటలకు లకు అలిపిరి దగ్గర పూజ కార్యక్రమాలు చేపట్టి అనంతరం మెట్లు ఎక్కి రాత్రికి తిరుమల చేరుకుని విశ్రాంతి తీసుకుని బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. రుగురువారం సాయంత్రం 4 గంటలకు తిరుపతిలోని జ్యోతిరావు పూలే సర్కిల్లో వారాహి సభ నిర్వహిస్తారని అక్కడికి పెద్ద సంఖ్యలో అభిమానులు, కూటమి నాయకులు ప్రజలు పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు విరూపాక్ష,టౌన్ అధ్యక్షులు నరేష్ రాయల్, జిల్లా ప్రోగ్రామ్స్ సెక్రటరీ చైతన్య రాయల్, ప్రధాన కార్యదర్శి హరీ నాయక్, కార్యదర్శి బాలాజీ నాయక్, నాయకులు రెడ్డి, సోము పాల్గొన్నారు.

## శాప్ చైర్మన్ రవి నాయుడుకి ఘన సత్కారం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి పట్టణంలో నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాప్



చైర్మన్‌గా నియమితులైన అనిమిని రవి నాయుడుని తిరుపతి పార్లమెంట్ ఎస్టీసెల్ అధ్యక్షులు. యం.సుబ్బయ్య మర్యాదపూ ర్వకంగా కలిసి సత్కరించారు. రవి నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియో జకవర్గం అన్ని విధాలుగా క్రీడాభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీనేత షేక్ షాకీర్‌ఆలీ, పట్టణ మైనార్టీ అధ్యక్షులు షేక్ షఫీ పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15 మందికి జరిమానా

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 15 మందిని 4వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 15 మందికి రూ.1.50 లక్షలు జరిమానా విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అభినందించినారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్త కుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** మండలంలోని కూర్మాయి, పలమనేరు అర్బన్ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పొలం సందర్శనలో భాగంగా ట్రైకోడెర్మా విరిడి కల్చర్ తయారీ విధానం వాడకం గురించి రైతులకు వివరించడం నారాయణ మామిడి పొలమును సందర్శించి కొమ్మలు కత్తరింపు మామిడి పంటలో చీడపీడల నివారణపై అవగా హన కల్పించారు. వర్షాలు లేని కారణంగాబోర్లలో నీరు తగ్గుతున్నందుకు రైతుల చే వరి పైరుకు పొటాషియం నైట్రేట్ స్ప్రే చేయడంపై అవగాహన కల్పించడంజరిగిందన్నారు. ఇందులో వ్యవసాయ అనుబంధ శాఖల పురోగతిని రైతులకు వివరించడం జరి గిందన్నారు.




ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వెంకటరమణారెడ్డి, కృష్ణారెడ్డి, నాయుడు, సుబ్రహ్మణ్యంగౌడు, వ్యవ సాయ శాఖ అధికారులు ఏఓ సంధ్య, సిరి కల్చర్ అధికారి లక్ష్మీ ప్రసన్న, రైతు సేవా కేంద్రం సిబ్బంది, స్పందన, కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేయడం జరిగింద ని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తండ్రి, జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెన్నకేశవులు నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక 20వ డివిజన్ నందు ఎన్టీఆర్ భరోసా భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ మాట తప్పను మడమ తిప్పను అని ప్రగల్భాలు పలికిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు సమయం తీసుకున్నారు. నేడు ఇచ్చిన మాటకు కట్టుబడి విడతల వారీగా కాకుండా ఒకేసారి పెంచిన పింఛన్‌లు అందజేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమైందన్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు నియో జకవర్గ టిడిపి పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్, నగర మేయర్ కుమారి అముద, మాజీ మేయర్ కఠారి హేమలత, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, 20వ వార్డు కార్పొరేటర్ అశోక్, కోలా కిరణ్, రాజశేఖర్ నాయుడు, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## దళితుల పట్ల ప్రభుత్వ తీరు బాధాకరం: ఎంపీ




**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజా సమస్యలను తిరుపతి ఎంపీ డా ఎం.గురుమూర్తి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలపై సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య చర్చించారు. వెంటనే తిరుపతి పార్లమెంటు సభ్యులు ఎం.గురుమూర్తి దళితులు అణచివేతను కూటమి ప్రభుత్వం అధర్మపాలన సాగిస్తోందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి విమర్శించారు. శ్రీకాళ హస్తి నియోజక వర్గంలో దళితులు, గిరిజనులు పట్ల అధికార పార్టీ అనుసరిస్తున్న తీరు బాధ కలిగిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టి అసైన్డ్ భూములను అమ్మకూడదు. కొనకూడదు అనే నిబంధన ఉన్నప్పటికీ అగ్ర కుల నాయకులు ఏదెచ్చగా ప్రభుత్వ భూములను కొనడం అన్యాయమని ఎస్సీ జాతీయ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. సమస్యలు మీద ఎంపీ చొరవ తీసుకోవడం మీద సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ధన్యవాదాలు తెలియజేశారు.

## దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం పిచ్చాటూరు రోడ్డు పక్కన సర్వే నంబర్ 360/2లో సుమారు రెండు ఎకరములు ప్రభుత్వ భూమి మంగళవారం కబ్జాకు గురైంది. ఈ భూమిని గుర్తు తెలియని వ్యక్తులు జెసిబితో చదును చేశారు. ఈ భూమి 2004 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు. అప్పటి ఎంపీ డాక్టర్ చింతామోహన్ తిరుపతి పార్లమెంట్ దళితులకు ఇంటి నివాసపట్టాలు ఇవ్వడం జరిగింది. కొన్ని సంవత్సరాల తరబడి ఇల్లులు నిర్మించలేదని. అప్పటినుండి ఇప్పటివరకు దళితులు మధ్య సయోధ్య లేక ఆ భూమిని తహసిల్దార్ దేవేందర్ రెడ్డి 2008-2009 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలను రద్దుచేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది. 2003 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈదులగుంట ఎస్సీ ఎస్టీలకు ఒకటిన్నర సెంటు లెక్కన ఇంటి పట్టాలు ఇవ్వాలని లేఅవుట్ వేసి కరెంటు. తాగునీరు బోర్లు వేయడం జరిగింది. మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఆర్డీఓ ఆఫీస్. ప్రభుత్వ అవసరాలకు కేటాయించాలని తెలిపి ఉన్నారు. విలువైన భూమిని కాపాడాలని శ్రీకాళహస్తి నియోజక వర్గం ప్రజలు కోరుతున్నారు.

## నారాయణలో ముందస్తు దసరా వేడుకలు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు శరన్నవరాత్రుల్లో అమ్మవారి వేషధారణలో వచ్చి అందర్నీ అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించడానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడిని వధించిన సందర్భంగా దేశమంతటా హిందువులు దసరా పండుగ జరుపు కుంటారని గుర్తుచేశారు. విద్యార్థులకు దసరాశుభాకాంక్షలు తెలియ జేశారు. ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ సురేష్, ఉపాధ్యాయులు చూడామణి, లత, మల్లిక పాల్గొన్నారు.



## మూతపడ్డ ప్రభుత్వ మద్యం దుకాణాలు

### మద్యం దుకాణాలలో విధులు చేపట్టే ఉద్యోగులు ధర్నా

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరులో ప్రభుత్వ మద్యందుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. మద్యం దుకాణాలలో విధులు చేపట్టే ఉద్యోగులు దుకాణాల ఎదుట ధర్నా చేపట్టి తమ నిరసనలను తెలిపారు. వారు మాట్లాడుతూ తమంతా గత 5 సంవత్సరాలుగా గత ప్రభుత్వం ఆదేశాల మేరకు మద్యం దుకాణంలో విధులను చేపట్టా మన్నారు. సేల్స్‌మెన్‌గా సూపర్వైజర్లుగా విధులు చేపడుతూ ప్రభుత్వా నికి మంచి ఆదాయాన్ని సమకూర్చామన్నారు. కరోనా సమయంలో సైతం తాము ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహించా మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాలాంటివారు 15వేల మంది ఉన్నారని వీరి కుటుంబాలు నేడు రోడ్డును పడ్డాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన పాలసీ ద్వారా మద్యం దుకాణాలు ప్రైవేటీకరణ చేయడంతో తాము ఇకపై ఎలా బతికేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడికైనా వెళ్లి ఉద్యోగ అవకాశం కోసం ప్రయత్నిస్తే గతంలో ఎక్కడ పనిచేశారు. మీ అనుభవం ఎంత వాటీకి సంబంధించిన సర్టిఫికెట్లను అడుగుతున్నా రని మద్యం దుకాణంలో పనిచేశామంటే ఉద్యోగ అవకాశాలు ఇతర చోట ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పలమనేరుకు సంబంధించి మద్యం దుకాణాలు 9ఉన్నాయని ఇందులో ఒక్కొక్క షాపుకు ముగ్గురు చొప్పున విధులను గత ఐదేళ్లుగా చేపడు తున్న మన్నారు. అయితే ఎప్పుడు కూడా దుకాణాల నగదును తమ స్వార్థం కోసం వాడు కోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాలాంటి వారిపై చొరవ చూపి ఉద్యోగ అవకాశాన్ని తిరిగి కల్పించాలన్నారు. ఏ పార్టీకి మేము సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ బ్రేవరేజ్ ఆదేశాల మేరకే విధులు చేపట్టామని కావున ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రిలు మాపై దయవుంచి మా కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, షఫీర్, జ్యోతి కుమార్, సునీల్, అశోక్, ఫయాజ్, హనుమంతు, ధనుజ్, మంజునాథ్, అనిల్, సురేష్, కేశవుల, మరికొంత మంది పాల్గొన్నారు.



## దేవ దేవుడితో రాజకీయాలు తగదు - ఎంపీ గురుమూర్తి



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** అయ్యా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాక్షాత్తు దేశ సర్వోత్తమ న్యాయస్థానమే సరైన ఆధారాలు లేకుండా శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తప్పుపట్టడమే కాకుండా రాజకీయాలలోకి దేవుళ్లను సైతం లాగడంపై ఆక్షేపణ వ్యక్తం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా సరైన విచారణ జరగకుండా కేవలం గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా దెబ్బకొట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీవారి దివ్య ప్రసాదం అయినా లడ్డులను అపవిత్రం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. అయ్యా ఉప ముఖ్యమంత్రి మిమ్మల్ని ఒక సూటి ప్రశ్న అడుగుతున్నాను. అసలు దెస సర్వోత్తమ న్యాయస్థానమే సరైన ఆధారాలు లేకుండా శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వాడారన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తప్పు పట్టిన నేపథ్యంలో అసలు శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వాడారు లేదా అన్న విషయంపై సమగ్ర విచారణ జరగనప్పుడు లడ్డు కల్తీ జరిగిందంటూ ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న మీరు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టడం ఏమిటండి? కనీసం దేవుళ్ళనైనా రాజకీయంలోకి లాగకండి అని సాక్షాత్తు సుప్రీమ్ కోర్టు చెప్పిన తరువాత కూడా తిరుమలలో ప్రాయశ్చిత్త దీక్ష విరమణ అంటూ మీరు సరికొత్త నాటకానికి తెరలేపటం ఏమిటండి ? అసలు కల్తీ జరిగిందా లేదా అని ఇంకా సుప్రీమ్ కోర్ట్ తేల్చలేదు. మీరు ప్రాయశ్చితపు బాట పట్టడం ఏమిటండి? మీ ముఖ్యమంత్రి తరువాత ఉప ముఖ్యమంత్రి అయినా మీరు కూడా అపద్ధాలకు ఆజ్యం పోసి హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తీయడానికి కంకణం కట్టుకొన్నారా అనితీవ్ర మనోవేదన గురై ఆయన మాట్లాడారు.

## ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేశాం

**- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ పుల్లయ్య**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** జిల్లా వ్యాప్తంగా 18 సం. ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ పుల్లయ్య తెలిపారు. మంగళవారం ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా -2025 పై ఎన్నికల సిఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వి.కోట నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా సచివాలయం నుండి డిఆర్ఓటి. పుల్లయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. సిఈఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాలన్నిటిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లకు సూచించారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన క్లెయిమ్ లను పరిష్కరించాలన్నారు. ఏ ఈ ఆర్ ఓ ల నియామకం చేపట్టాలని తెలిపారు. జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌కు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తి చేయడమైనదని, ఫారం 6కు సంబంధించి 3,766, ఫారం -7కు సంబంధించి 9913, ఫారం-8కు సంబంధించి 16,642 క్లైమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో పరిష్కరిస్తామని, డెత్ క్లెయిములు కూడా పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. వీటితో పాటు క్రమం తప్పకుండా గుర్తింపు పొందిన రాజకీయ నాయకులతో సమీక్షా సమావేశాలు, ఏఈఆర్ ఓ లను నియమించడం జరిగిందని, స్వీప్ యాక్టివిటీకి సంబంధించి డిఆర్డిఏ పిడి, జెడ్పి సిఈఓ లను నోడల్ అధికారులను నియమించడం జరిగిందని, ఈఆర్ఓ లకు స్పెషల్ సమ్మరీ రివిజన్ కు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. 18 సం. ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేశామని కలెక్టర్ సిఈఓకు వివరించారు.






## రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు...

**- ఎమ్మెల్యే థామస్**

**గంగాధరనెల్లూరు, మేజర్‌న్యూస్:** సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నారని నియోజకవర్గ శాసనసభ్యులు థామస్, జిల్లా యాదవ సాధికారత అధ్యక్షులు శ్రీధర్ యాదవులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెల్లెపల్లి పంచాయతీ నెల్లేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, జీడి నెల్లూరు జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందని అన్నారు. ఒకటవ తేదీ వాలంటీర్లు లేకుండానే పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇవ్వడంతో వారి సంతోషానికి అవధులు లేవని అన్నారు. అదేవిధంగా రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడిపి రాష్ట్రం రాష్ట్ర ప్రజలు సస్యశ్యామలంగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సారధ్యంలో రాష్ట్రం మరింత ముందుకు



వెళ్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతకుముందుగా ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి దాస్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, జీకే దేవరాజు నాయుడు, మాజీ ఉపసర్పంచ్ వెంకటపతిరెడ్డి, జయరాం రెడ్డి, ముని కృష్ణారెడ్డి, జ్యోతిశ్వర్, భూపాల్, శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ను కలిసిన జిల్లా టీడీపి అధ్యక్షులు డాక్టర్ సీ ఆర్ రాజన్

**చిత్తూరు అర్బన్ మేజర్‌న్యూస్:** రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ను మంగళవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జిల్లా టీడీపి అధ్యక్షులు డాక్టర్ సీ ఆర్ రాజన్ కలిశారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా రాజకీయ పరిస్థితులు గూర్చి కూలంకశంగా చర్చించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు సి.ఆర్ రాజన్ మీడియా కు తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నియకుల క్షత్రియ సంఘం కార్యదర్శి కె విజయ్ కుమార్, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బీసీవైఎం పార్టీ అధ్యక్షుడు

**తిరుమల, మేజర్‌న్యూస్:** పుంగనూరు నుండి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా ముగిసింది.ఇది రాజకీయ పాదయాత్ర కాదు భక్తుల కోసం చేపట్టిన పాదయాత్ర.తిరుమలలో రోజుకొక వివాదం చోటు చేసుకుంటోంది.వివాదాలకు ముగింపు పలికి టీటీడీ ప్రక్షాళన జరగాలి.టీటీడీ అంటే భక్తులకు స్వామివారికి సేవ చేసే కార్యక్రమాలు జరగాలి.శ్రీవారి ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి టిటిడి సొంతంగా డైరీ ఏర్పాటు చేయాలి.ధర్మ ప్రచారం పేరిట ప్రతిఏటా వందల కోట్లు ఖర్చు పెడుతున్నారు.గో సంరక్షణ కంటే ధర్మ ప్రచారం ఏది కాదనేది నా భావన. టీటీడీ డైరీని ఏర్పాటు చేసి డైరీ ద్వారా వచ్చే నెయ్యితో మాత్రమే ప్రసాదాలు తయారు చేయాలి.టీటీడీ ఏర్పాటు చేయబోయే డైరీకి వెయ్యి గోవులను దానం చేయడానికి సిద్ధంగా ఉన్నాను.దేశవ్యాప్తంగా లక్ష గోవులు సమకూర్చే బాధ్యత తీసుకుంటాను.దీనిపై రాజకీయాలు చేయకుండా డైరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పెద్దలను టీటీడీ అధికారులను కోరుకుంటున్నా. చంద్రబాబు హయాంలో ఈ కార్యక్రమాన్ని చేపడితే చరిత్రలో నిలిచిపోతారు. చిత్తూరు డైరీ ని టీటీడీ పరిధిలోకి తీసుకురావాలని 2019లో పాలకమండలి నిర్ణయం తీసుకున్నా అమలు కాలేదు అని రామచంద్ర యాదవ్ తెలిపారు.



## ఒక పాలక మండలి చేసే తీర్మానాలు గతం కంటే మెరుగ్గా ఉండాలి

**- అలా చేయకుండా ఆ తీర్మానాలను సైతం దాచిపెట్టారు**

**- ఆ ముగ్గురు రెడ్లు శ్రీవారికి,భక్తులకు క్షమాపణ చెప్పాలి**

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** వైసిపి ప్రభుత్వం కంటే ముందున్న టిడిపి పాలనలో అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చేసిన తీర్మానాల కంటే తర్వాత వచ్చిన పాలకమండలి అంతకంటే మెరుగ్గా తీర్మానాలు చేయాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియా ముందు ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలోని టీటీడీ పాలకమండలి ఫిబ్రవరి 29, 2020 నాడు జరిగిన సమావేశంలో రెజల్యూషన్ నెంబర్ 371 తీసుకువచ్చి తమకు నచ్చిన వారికి లడ్డు తయారీకి కావలసిన నెయ్యి సరఫరా టెండర్ను కట్టబెట్టిందని అన్నారు.వాస్తవానికి టీటీడీ నియమ నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాల పాటు నిరవధికంగా డైరీని నడుపుతూ ఉండాలని,అలాగే రోజుకు నాలుగు లక్షల ఆవు పాలను సేకరించే విధంగా ఉండాలని,8 టన్నుల నెయ్యిని తయారు చేయాలని,ఆ సంస్థ ఆదాయం సంవత్సరానికి రూ:250 కోట్ల వరకు ఉండాలని తెలిపారు. వీరు ఆ కండిషన్ నెంబర్ 18 ని పక్కన పెట్టి..డైరీ ని ఒక సంవత్సరం నుండి నడిపితే చాలు,సంవత్సరానికి 150 కోట్ల టర్నోవర్ ఉంటే చాలు అని,వాళ్ల కమిషన్ల కోసం అప్పటి టీటీడీ చైర్మన్ గా ఉన్న వైవి.సుబ్బారెడ్డి, ఈవో జవహర్ రెడ్డి నెయ్యి సరఫరా కాంట్రాక్టును నచ్చినవారికి కట్టబెట్టారని మండిపడ్డారు.టిటిడి నియమ నిబంధనలను ఎవరికోసం ఎందుకోసం మార్చాల్సి వచ్చిందో సుబ్బారెడ్డి,ధర్మారెడ్డి, కరుణాకర్ రెడ్డిలు ఆ కలియుగ వైకుంఠం శ్రీవారికి,భక్తులకు సమాధానం చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.కల్తీ నెయ్యి



విషయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రభుత్వం తరపు న్యాయవాదిని మూడు ప్రశ్నలు వేసింది.అంతేగాని ప్రభుత్వం పొరపాటు చేసిందని ఎక్కడ తీర్పు ఇవ్వలేదు.అంతమాత్రానికే వైసీపీ ముఖ్య నాయకులు,ఇతర నాయకులు శునకానందం పొందుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి శాసన సభ్యులతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..గత వైసిపి పాలనలో జరిగిన విధ్వంసం, అవినీతి,అరాచకాలపై,అలాగే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు.ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి లడ్డు తయారీలో నెయ్యి కల్తీ జరిగిందని నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ (ఎన్డిడిబి) ఇచ్చిన నివేదికపై ప్రస్తావించడం జరిగింది.అది నిజం కాబట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారన్నారు.ఇప్పటికే స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీం (సిట్) దర్యాప్తు చేస్తోందని,అవసరమైతే సిబిఐ ని కూడా రప్పించి విచారణ చేసి,రానున్న రోజుల్లో జరిగిన అవినీతి,అరాచకాలపై ప్రజలకు వాస్తవాల్ని తెలియజేస్తామని అన్నారు.సమావేశంలో నేతలు అజయ్ కుమార్, వరప్రసాద్,డాక్టర్ శ్రీహరి, జీవన్ రాయల్,సుబ్బు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ కల్తీ ఘటనపై
# సిట్ దర్యాప్తు తాత్కాలికంగా నిలిపివేత
### – ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు.

తిరుమల మేజర్‌న్యూస్: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందనే అంశంపై ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయవాదులు చేసిన సూచన మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా విచారణ కొనసాగిస్తామని చెప్పారు.



# ప్రతి పేదవానికి టీడీపీ భరోసా - ఎమ్మెల్యే నెలవల
### -తల్వాయిపాడులో పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఉన్న ప్రతి పేద కుటుంబానికి తెలుగుదేశం పార్టీ భరోసాగా నిలుస్తుందని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డా.నెలవల విజయ్ శ్రీ అన్నారు.మండలంలోని తల్వాయిపాడు గ్రామం నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయ్ శ్రీ,సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ శిరసనంభేటీ విజయ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ శ్రీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు.మండలంలో అన్ని పంచాయతీలో రానున్న రోజుల్లో ప్రతి పంచాయతీలో సిసి రోడ్లు,స్మశాన వాటికకు దారులు ఏర్పాటు చేస్తామని వారు పేర్కొన్నారు.అదేవిదంగా సీయం చంద్రబాబు బాబు నాయుడు ఎన్నికల ముందు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు కూడ ఒక్కోటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల అన్నా క్యాంటీన్ లను కూడ ఏర్పాటు చేసి ప్రారంభించారని వారు పేర్కొన్నారు.సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా రానున్న దీపావళి పండుగకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ లు ప్రతి ఒక్కరికి అందచేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే డా.నెలవల విజయ్ శ్రీ సువర్ణ చేతుల మీదుగా పింఛన్ దారులకు పింఛన్ నగదును అందించారు.కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు కె.సురేష్ బాబు,తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వేలూరి మురళి కృష్ణా రెడ్డి, స్వర్ణముఖి ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్ నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి,సర్పంచ్ ల సంఘము ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కందమూడి శివ కుమార్,నాయకులు మల్లి రెడ్డి,దామెర ప్రసాద్ నాయుడు,పాలచ్చురు నరేంద్ర యాదవ్,మారాబత్తిన గురవయ్య, స్థానిక నాయకులు గంగాబత్తిన రామకృష్ణ,గంగా బత్తిన శ్రీనివాసులు,కిలారి గోపి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్‌ను ప్రణాళికలు సిద్ధం చేయాల్లి జాయింట్ కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సర్ణాంధ్ర ఏ 2047 విజన్ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ స్వర్ణాంధ్రఏ 2047 అమలు పై ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాలు, వాణిజ్య సంస్థలు మరియు ప్రముఖులు, జిల్లా అధికారులతో ఒక రోజు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ లో బాగంగా మండల, జిల్లా స్థాయి లో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి అని తెలిపారు. అన్ని శాఖల ఇన్పుట్స్ అనుగుణంగా జిల్లా అధికారులు ఐదు సంవత్సరాల యాక్షన్ ప్లాన్ ను తయారు చేసేలా దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందుకు జిల్లాలోని ప్రతి శాఖ స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్ రూపకల్పనకు కృషి చేయాలని తెలిపారు. సి పి ఓ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్యాన్ని కనుగొనంగా వ్యవసాయం మరియు ఇతర రంగాలలో అభివృద్ధి దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. తెరమైన వృద్ధితో కూడిన ఆర్థిక వ్యవస్థ సుస్థిర ప్రభుత్వం డిజిటల్ సుపరిపాలన వాతావరణ ప్రాధాన్యతగా




అభివృద్ధి విధానం, సాంకేతిక, వైద్యం నైపుణ్యం పెంపుదల తదితర అంశాలు ప్రాధాన్యతగా దార్శనిక పత్రం రూపొందించుకోవాలని తెలిపారు. స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాలు, వాణిజ్య సంస్థలు మరియు ప్రముఖులు పాల్గొని వారి సలహాలు సూచనల వర్క్ షాప్ నందు తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్కరు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తెలియపరచవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి శాఖకు సంబంధించిన స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా జిల్లా అభివృద్ధి కి వారు రూపొందిస్తున్న ప్రణాళికలను తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, సి పి ఓ. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆంజనేయస్వామి దసరా జెండా మహోత్సవం

**గూడూరురూరల్ మేజర్‌న్యూస్:** గూడూరులో ఆంజనేయస్వామి దసరా పండుగకు గొప్ప చరిత్ర ఉంది. 1948 సంవత్సరం అక్టోబర్‌లో ఆంజనేయ స్వామి జెండా మహోత్సవానికి పునాది వేశారు. భక్తులు అత్యంత విశ్వాసముతో. కుల మతాలకు అతీతంగా.సమైక్యతకుచిహ్నంగా, సామరస్యంగా భక్తుల పత్రికగా, ఈ పండుగను జరుపుకుంటారు. 1948వ సంవత్సరం తూర్పు వీధికి చెందిన ముక్కాసి వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా ఆంజనేయస్వామి జెండా మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. 1948 సంవత్సరానికి పట్టణంలో వ్యాధులు ప్రబలడం, పశువులు మృత్యువాత పడడం, వర్షాలు పడక పోవడం వంటి కారణాల చేత మన పెద్దలు ఆంజనేయస్వామిని ప్రార్థించి తమ బాధల నుండి రక్షించినట్లయితే ప్రతి సంవత్సరం జండా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వేడుకొన్నారు. ఈ క్రమంలో 6 గజాల తెల్లటి గుడ్డపై సంజీవ పర్వతం చేత భూనీ ఆంజనేయస్వామి తెల్లటి గుడ్డుపై బొగ్గుతో గీసి ఆ ప్రతిమను పురవీధులలో జండా ఉత్సవాన్నిగావించారు. 20 అడుగుల వెదురు కర్రకు ఆంజనేయ స్వామి జెండాను కట్టి ఆరు ప్రధాన శక్తి పీఠాలకు ప్రత్యేక పూజలు చేస్తూ గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. మొదటి శక్తిపీఠం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయర్ణం, రెండవది శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపాన, మూడవది పాండురంగ స్వామి ఆలయ సమీపాన, నాలుగవది చిల్లకూరు శేషం హైస్కూల్ సమీపాన శివాలయం, ఐదవది బ్రాహ్మణు వీధిలోనున్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద శక్తి పీఠం, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఒక శక్తి పీఠంకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ జెండా ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. మహాలక్ష్మి అమావాస్య రోజున ఆంజనేయస్వామి దశర జెండా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. నాలుగో తేదీ నుండి తొమ్మిది రోజులు పాటు దేవతామూర్తులు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శన మిస్తారు భక్తులు అత్యంత విశ్వాసంతో జరుపుకునే పండగే. ఆంజనేయస్వామి జెండా పండుగ ఈ క్రమంలో గూడూరు పట్టణంలో జెండా పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. దసరా పండగ ఏర్పాట్లు తో గూడూరు దసరా శోభ సంతరించుకుంది.కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు, ఆంధ్రప్రదేశ్లోని గూడూరు లో జరిగే దసరా పండుగకు విశిష్టత ఉంది. గతంలో మైకా. సిలికా, నిమ్మ ఎగుమతుల దృశ్య గూడూరుకు మంచి పేరు ప్రఖ్యాతలు కలవు. ఆ క్రమంలో అతివృష్టి అనావృష్టి సంభవించడం, వింత వ్యాధులు సోకడ,. వర్షాలు పడకపోవడం వంటి అనేక కారణాలవల్ల ఆంజనేయ స్వామి జెండా మహోత్సవ కార్యక్రమాన్ని తల పెట్టాలని పలువురు స్థానికులతో పాటు వ్యాపారస్తులు ఆర్థిక సహకారంతో




నేడు ఆంజనేయ స్వామి దసరా జండా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటిలో 116 రూపాయలతో ప్రారంభమైన జెండా మహోత్సవ కార్యక్రమ. నేడు సుమారు 10 లక్షల నుండి 70 లక్షలరూపాయల వరకు వెచ్చిస్తున్నారు. 1948 సంవత్సరం నుండి ఆంజనేయస్వామి దసరా జండా మహోత్సవం జరుపుకుంటున్నారు. జెండా పండుగ నిర్వహిస్తున్నారు. ప్రధాన వీధులలో, దేవాలయాల వద్ద, నిర్వాహకులు డబ్బులు వెచ్చించి వేడుకలను జరుపుకుంటున్నారు. ఆంజనేయస్వామి దసరా జండా మహోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులతో పాటు బంధుమిత్రులు భారీ సంఖ్యలో గూడూరు పట్టణానికి చేరుకొని జండా మహోత్సవ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. ఈ ఆంజనేయ జెండా మహోత్సవ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మహిషాసురమర్ధిని, పార్వతీ పరమేశ్వరులు, విచిత్ర వేషధారణ, వివిధ దేవత మూర్తుల ప్రతిమలు, కోలాటం,
పండరి భజన, కేరళ వైద్యం, కుమ్మి పంబల వాయిద్యం, డప్పులు, డీజే,తీన్మార్, చెక్కభజన, చిన్నారులు నృత్య ప్రదర్శన, ఈ జండా మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఆకర్షణీయంగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో తూర్పు వీధుల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణ దేవతామూర్తుల ఆర్చిలు, మహిషాసురమర్దని బొమ్మల కొలువు, తదితర చూపుర్లను ఆకర్షిస్తున్నాయి. దీనికి తోడు చిన్నారుల వినోదం కోసం గూడూరు ఆర్టిసి బస్సు సమీపాన గ్రాండ్ ఎగ్జిబిషన్ వంటి ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఆంజనేయస్వామి దసరా జెండా మహోత్సవం నిర్వహించుకోవాలని గూడూరు డిఎస్పి హెచ్చరికలు జారీ చేశారు. దసరా జండా మహోత్సవానికి 320 మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేసి ఉన్నారు. జెండా ఊరేగింపులో బాణాసంచా నిషేధం ఆంక్షలు, మత విద్వేషాలు సామరస్యంగా నిర్వహించుకోవాలని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు.



# భూ సమస్యలపై అందే ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం

**- రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్**



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్:** భూ సమస్యల పై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి మంగళగిరి లోని సిసిఎల్ఏ ఆఫీసు నుండి ఫ్రీ హోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ పరిస్థితి పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సచివాలయం నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి జి.విద్యాధరి, డి ఆర్ ఓ బి.పుల్లయ్య, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డి ఐ జి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రీవెన్స్ ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకురావాలని, ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం పదేపదే ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవద్దని కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల చివరినాటికి ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ పూర్తి చేయాలని తెలిపారు. సీఎంఓ, రెవెన్యూ మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన గ్రీవెన్స్ పై వెనువెంటనే స్పందించాలని ఆదేశించారు. భూ సమస్యల పై అందే ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. భూ సమస్యల పరిష్కారం పై క్షేత్ర స్థాయిలో సమీక్షించుకోవాలన్నారు. అర్జీదారులతో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, భూ సమస్యలు అధిక శాతం కుటుంబ సభ్యుల మధ్య ఉన్నవే ఉన్నాయని, రీ సర్వే, డి కె టి పట్టాలు ఆన్ లైన్ లో నమోదు కాకపోవడం వంటి కారణాల వలన అధిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు గుర్తించామని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు.

## చావాలిలో పొలం పిలుస్తుంది



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రైతుల సమస్యలను తీర్చేందుకే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండలంలోని చావాలి పాలచురు పంచాయతీలలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి.ప్రవీణా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్ కు సంబంధించి అనువైన వరి రకాలను,ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.అనంతరం నవ ధాన్యాలు చల్లిన పొలాలను పరిశీలించి దాని ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు లక్ష్మి దేవి, వ్యవసాయ శాఖ అధికారి శశిధర్ రెడ్డి,స్థానిక టీడీపీ నాయకులు అక్కరపల్లి మాధవ్ రెడ్డి, వీఏఏ మణి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## బోయకొండ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు 57 రోజులకు గాను నగదు రూపంలో యాభై ఒక లక్షా,యాభై ఏడువేలా తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయలు వచ్చింది. బంగారు 61 గ్రాములు, వెండి 450 గ్రాములు, ఉజ్జబికిస్థాన్ వెయ్యి సియంలు మూడు నోట్లు, ఉజ్జబికిస్థాన్ ఐదు వందలు సియంలు రెండు నోట్లు,సింగపూర్ పది డాలర్లు ఒకటి, రణబేరి గంగమ్మ దేవస్థానం ఆదాయం ముప్పై ఐదువేల ఐదు వందల రెండు రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి జే.ఏకాంబరం, ఆలయ అర్చకులు, మదనపల్లి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ యస్.శశికుమార్,చౌడేపల్లి పోలీసు సిబ్బంది, ఐసిఐసి బ్యాంకు దిగువపల్లి వారు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## రవి నాయుడుకి సన్మానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా నియమితులైన అనిమిని రవి నాయుడును టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర్ ప్రధాన కార్యదర్శి నైనారు మహేష్ యాదవ్, పార్లమెంటు కార్యదర్శి చెంబకూరు రాజయ్య, గంగమ్మ ఆలయ టెంపుల్ మాజీ డైరెక్టర్ కోనేటి ఋషి పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మొండి వెంగనపల్లి పంచాయతీలో టిఎన్టి యుసి ఉపాధ్యక్షుడు పోటు గారి గంగయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పెన్షన్లను అందించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తెలుగుదేశం ప్రభుత్వానికి సాధ్యమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, యువ నాయకులు కావలి హరినాథ్, లోకేష్ రెడ్డి, పోటు గారి తిరుమలయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంకు పసుపులేటి స్వాగతం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** ప్రాయశ్చిత దీక్ష విరమించడానికి తిరుపతికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మంగళవారం ఘన స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలపై సుదీర్ఘంగా మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ తిరుమలకు అలిపిరి మెట్ల మార్గాన బయలుదేరి వెళ్లారు.

## తెలుగుదేశం నేత చంద్రశేఖర్ నాయుడుకు పరామర్శ



**ఏర్పేడు, మేజర్ న్యూస్:** ఏర్పేడు మండలం అముదూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యూనిట్ ఇంచార్జ్ చంద్రశేఖర్ నాయుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న వారిని రాష్ట్ర అధికారకార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి. మండల పార్టీ అధ్యక్షులు పున్నారావు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి. పార్లమెంటు ఎస్సీ అధికార ప్రతినిధి కేకే రమణ. మండల యువత అధ్యక్షులు గుణ యాదవ్. తదితరులు కలిసి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

## దసరా సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు చేపట్టండి



**గూడూరు, మేజర్‌న్యూస్:** దసరా సెలవుల్లో పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశి కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలకు ప్రకటించిన దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాల పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు విద్యార్థులకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. తరగతులు నిర్వహించే పాఠశాలను వెంటనే తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ. ఐ.ఎస్.ఎఫ్ నాయకులు యశ్వంత్ , సాయి భగత్ , తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు నెల్లటూరు విద్యార్థి



**గూడూరురూరల్ మేజర్‌న్యూస్:** మండలంలోని నెల్లటూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్న త పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న వెంకట కార్తీక్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతమ్మ తెలిపారు. అక్టోబర్ 5వ తేది నుండి 7వ తేది వరకు విశాఖపట్నం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియచేసారు. ఈ సందర్భంగా విద్యార్థి వెంకట కార్తీక్ ను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## మండల స్థాయి చెకుముకి పరీక్షలు



**గూడూరురూరల్ మేజర్‌న్యూస్:** గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్కూల్ స్థాయిలో ప్రథమంగా వచ్చిన విద్యా ర్థిని, విద్యార్థులకు మండల స్థాయిలో చికుముకి సైన్స్ పరీక్షలను జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో మంగళవారం నిర్వహించారు.జడ్పీ బాయ్స్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే సైన్స్ పట్ల అవగాహన కలిగితే భవిష్యత్తులో వారు చుట్టుపక్కల ఉన్నటువంటి సమాజాన్ని, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలన్నారు.జన విజ్ఞాన వేదిక గత 32 సం.ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా చేస్తున్నందుకు జేవివి సభ్యులందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. మండల స్థాయి పరీక్షలు మా స్కూల్లో నిర్వహించే అవకాశం కల్పించినందుకు. చాలా సంతోషిస్తున్నానని. జే.వి.వి.అన్ని విధాలా సహకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, సుమన్ రెడ్డి, వివిధ కళాశాలలఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాబును కాపాడిన ఆపద్బాంధవుడు గోవిందుడు

**: టీడీపీ మాజీ జిల్లా ఆనంద నాయుడు**



**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** భక్తితో నమ్మిన వారిని కాపాడే ఆపద్బాంధవుడు గోవిందుడు అని ఇందుకు నిదర్శనం 2003 అక్టోబర్ 1న అలిపిరి బాంబు పేలుడు ఘటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సురక్షంగా బయటపడడమే నిదర్శనమని టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అత్తులూరి ఆనంద నాయుడు తెలిపారు. అలిపిరి ఘటన చోటుచేసుకుని నేటికీ 21 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మొక్కుబడిలో భాగంగా అత్తులూరి ఆనంద నాయుడు మంగళవారం అలిపిరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు సమర్పించి శ్రీవారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంచి నాయకుడు, రాజకీయ దురంధరుడు ప్రజా సంక్షేమని కాంక్షించే చంద్రబాబు నాయుడుకి అత్యంత ప్రమాదకరమైన బాంబు ఘటనలో తిరుమల వెంకటేశ్వర స్వామి పునర్జన్మనిచ్చారని తెలిపారు. తద్వారా సుదీర్ఘంగా రాష్ట్ర పాలకుడుగా ప్రజా సంక్షేమ పాలన అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగుతున్నారని తెలియజేశారు. బాబు పునర్జన్మనిచ్చిన భగవంతుడు రుణం తీర్చుకోలేనిదని, ప్రతి ఏటా ప్రత్యేక పూజలతో ఆయనకు కృతజ్ఞతా భావంతో మొక్కులు చెల్లించుకుంటున్నామని తెలియజేశారు. ఇంకా 10 సంవత్సరాలు నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో కలియుగ వైకుంఠ నాథుడు ఆయనకు సంపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రత్నం, చలపతి, సాయి, రజిని, హిమవంత్ భాను చౌదరి, మునేంద్ర, సందీప్, రవిరెడ్డి, పి కిరణ్ కుమార్, శివనందం, శంకర్ సాయి జయదీప్ పాల్గొన్నారు.

## మండలంలో 97.37 శాతం పింఛన్లు పంపిణీ

**- పెన్షన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే థామస్**



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో 97.37% ఎన్టీఆర్ భరోసా సామూహిక పింఛన్లను పంపిణీ చేసినట్లు మండల స్థాయి అధికారులు తెలిపారు. మనదే శంలోనే ఇంటికి వచ్చి అందరి ప్రభుత్వం అధికారులను గ్రామాలకు పంపించి ఎమ్మెల్యే సైతం ఇంటింటికి వచ్చిపింఛన్ ఇచ్చే కార్యక్రమం ఎక్కడ జరుగుతుంది అంటే ఒక ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. కార్వేటి నగరం మండలం పాదిరి కుప్పం గ్రామాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం లో ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొన్న యుగంధర్ ఆధ్వర్యంలో పింఛన్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలను ఆదుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు పెన్షన్లతోపాటు గ్రామాలు మౌలిక వసతులు పాటు ప్రజలను నుంచి వచ్చిన ఫిర్యాదులను అక్కడే అధికారులకు సమస్య పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ మండల అధ్యక్షుడు చంగ్రాయ్ యాదవ్ మాజీ కార్యదర్శి హేమంత్ రెడ్డి, బీగాల రమేష్, మోహన్ మురళి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు దాము మండల అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావలి వారి పల్లిలో పించన్లు పంపిణీ

**తిరుపతిరూరల్, మేజర్‌న్యూస్:** చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం కావలి వారి పల్లి పంచాయతీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు క్రిష్ణమనేని సావిత్రి ప్రభాకర్ నాయుడు. సర్పంచ్ చంగల్ రాయలు వార్డ్ మెంబర్ వేణుగోపాల్ సెక్రటరీ బేబీ రాణి యువత జగదీష్ గుణశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## జాయింట్ కలెక్టర్ ద్వారా యానాదిభూముల పరిశీలన



**చౌడేపల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని దిగువపల్లి పంచాయతీ ఆర్ఆర్ కాలనీకి చెందిన 22 మంది లబ్ధిదారులకు 2008లో వ్యవసాయ డీకేటీ పట్టాలు ఇచ్చారు. అయితే ఆ భూములు పక్కనే ఎకో టూరిజం శాఖకు రెవిన్యూ వారు కొంత భూమిని అప్పగించారు. ఈ క్రమంలో 2008లో డీకేటీ పట్టాలు కలిగిన యానాదులు సెప్టెంబర్ 30న చిత్తూరు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తమ భూములను స్వాధీన పరచాలని కోరుతూ ఫిర్యాదులు చేశారు దీంతో జాయింట్ కలెక్టర్ విద్యాదరి భూములను పరిశీలించారు 2008లో పట్టాలన్న వారందరికీ భూములు పరిశీలించి అందజేయాలని తహసిల్దార్ హనుమంతు నాయక్ జాయింట్ కలెక్టర్ విద్యదరి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా గట్టువారిపల్లిని ఆమె సందర్శించారు. అక్కడున్న యానాదుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారిలో పలువురికి ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు త్వరలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ విద్యా దారి అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ భారతి రెవెన్యూ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులకు ఫలసరుకులు, కూరగాయలు, దుస్తులు

**వాకాడు, మేజర్ న్యూస్:**వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిట్టమూరుకు చెందిన మహర్షి ఎస్వీ కృష్ణమూర్తి, యమునాదేవి దంపతులకు చిట్టమూరు రుక్మిణమ్మ కుటుంబ సభ్యులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల ఆర్థిక సౌజన్యంతో ఐదువేల రూపాయలు విలువచేసే ఫలసరుకులు, కూరగాయలు, వస్త్రములను సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో చేసే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు వృద్ధ దంపతులకు ఫలసరుకులు, కూరగాయలు వస్త్రములను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి తేజోవతి పాల్గొన్నారు.



## భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చు



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** వ్యవసాయ భూమిలో వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎటువంటి పంటలు పండించుకోవచ్చు అని వ్యవసాయ శాఖ అధికారి హేమలత కార్వేటి నగరం మండలం లక్ష్మీ రాజ్ పేట, గోపి శెట్టిపల్లి, ఈదు వారి పల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామలందు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరుపడం జరిగింది. సాగు ఖర్చులు తగ్గించుకుంటు నూతన శాస్త్రీయ సాగు విధానాలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందుతూ రైతన్నలు అధిక ఆదాయాలు గడించాలనే సదుద్దేశంతో తోనే ఈ పొలం పిలుస్తుంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారిణి, హేమలత రైతులకు తెలిపారు, మామిడి మరియు చెరకు పంటల్లో మద్దతు ధర కోసం జిల్లా కలెక్టరుకు వివరించడం జరిగిందని, మామిడి మరియు కూరగాయ పంటల్లో జీవ నియంత్రణ పద్ధతులు పాటించడం వల్ల ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించవచని తెలిపారు, అలాగే పాడి రైతులకు గోకులాలు ఏర్పాటుకు అదనంగా మన మండలానికి 50 గోకులాలు మంజూరు చేయించామని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసన్న లక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ పరందాము రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తా

**- చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు**

**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** భూ సమస్య లపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చిత్తూరు ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం చిత్తూరు ఆర్డీ వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా తెలుగు గంగ ప్రాజెక్టు నందు భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలలో భాగంగా చిత్తూరు ఆర్డీవో గా నియమించడం జరిగిందని తెలిపారు. రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సిబ్బంది సహకారంతో భూ సమస్యలను సత్వరం పరిష్కరిస్తామన్నారు.



# ప్రపంచం మెచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**- చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి కేరాఫ్ గురజాల జగన్మోహన్**
**- 32 డివిజన్ టిడిపి నాయకురాలు హేమావతి**

**చిత్తూరు, మేజర్‌న్యూస్:** యావత్ ప్రపంచం మెచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అలాగే ఆయన అడుగుజాడల్లో నడుస్తూ చిత్తూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్న శాసనసభ్యులకు కేరాఫ్ చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ అని 32 వ డివిజన్ టిడిపి నాయకురాలు హేమావతి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అందిస్తున్న నాలుగు వేల రూపాయలు ఆరువేల రూపాయల పెన్షన్ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు 32 వ డివిజన్ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ కిషోర్, షాహినూర్ లా ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందించారు ఈ సందర్భంగా హేమావతి మాట్లాడుతూ వృద్ధుల, వికలాంగుల, వితంతు తదితరుల కళ్ళల్లో ఆనందాన్ని చూడడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ఎన్నికల మేనిఫెస్టో మేరకు అందిస్తున్న నాలుగు వేల రూపాయల, 6000 రూపాయల పెన్షన్ నగదును చిత్తూరు నియోజకవర్గ యంగ్ అండ్ డైనమిక్ పొలిటికల్ హీరో శాసనసభ్యులు గురుజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు 32 వ డివిజన్ నందు లబ్ధిదారులకు అందిస్తున్నాం అని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదేశాల మీదకు చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే చిత్తూరు



నగరపాలక సంస్థ కమిషనర్ నేతృత్వంలో డివిజన్ పరిధిలోని ప్రతి లబ్ధిదారులకు మంగళవారం నాడు పూర్తిగా అందించేందుకు కృషి చేస్తున్నామని యావత్ ప్రపంచం మెచ్చిన ముఖ్యమంత్రి ఉన్నారంటే అది కేవలం మన రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఆయన రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పరుస్తున్నారు ఆయన అడుగుజాడల్లో చిత్తూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ అభివృద్ధిలో ముందుకు తీసుకెళు న్నారని అన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా సచివాలయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆ సమస్యలను చిత్తూరు శాసనసభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మోహన్, హారిక, కిషోర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపులు మూత... తమిళనాడుకు మద్యం ప్రియుల క్యూ

**- ఆందోళనలో ఔట్సోర్సింగ్ కార్మికులు**
**- తమ పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న కార్మికులు**
**- తమిళనాడుకు క్యూ కడుతున్న మద్యం ప్రియులు**

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** ఐదేళ్లపాటు మద్యం షాపుల్లో పనిచేసిన ఔట్సోర్సింగ్ కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమాలు దిగారు పెండింగ్ జీతాలు ఇవ్వకపోగా... కనీసం ఉద్యోగ బాధ్యత లేకుండా గుట్టుచప్పుడు కాకుండా తమను ప్రభుత్వం ఇంటికి పంపే మార్గం చూపడం అన్యాయమైన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 12 నుంచి రాష్ట్రంలో ప్రైవేట్ మద్యం షాపులను పెరవనున్న విషయం తెలిసిందే. ఈ



నేపథ్యంలో గత ఐదేళ్లుగా మద్యం షాప్ లో పనిచేసిన కార్మికులు ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం సమ్మెకు దిగారు. ప్రభుత్వ మాత్రం ఈనెల ఆరో తేదీ వరకు షాపుల్లో పనిచేయాలని కార్మికులను కోరడం, కార్మికులు మాత్రం లిఖితపూర్వకమైన హామీ ఇవ్వడంతోపాటు, తమకు వైన్ షాపులో పనిచేసే అవకాశం కల్పించాలని కోరడం కూడా జరిగింది. ప్రైవేట్ మద్యం షాపులు వస్తే... తమ బతుకులు ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా మద్యం షాపులు మూతపడటంతో మద్యం ప్రియులు అవస్థలు పడుతున్నారు. కొందరు ద్విచక్ర వాహనాల్లో సమీప తమిళనాడు వైన్ షాపులు బాట పట్టడం జరుగుతుంది.

## చిన్నారి అస్వియా మిస్సింగ్ కేసు సిరియస్‌గా తీసుకున్న పోలీసులు

పుంగనూరు మేజర్‌న్యూస్: పట్టణంలోని ఉబేదుల్ల కాంపౌండ్ లో నివాసమున్న అజమతుల్లా ఫైనాన్స్ వ్యాపారి కుమార్తె అస్వియా 7 ఆదివారం రాత్రి కిడ్నాప్ అయిన విషయం పాఠకులకు విధితమే 48 గంటలుగా 11 బృందాలతో అన్ని కోణాల్లో డీఐజీ జిల్లా ఎస్పీ నేతృత్వంలో స్వయపరివేక్షణ లో పోలీసులు దర్యాప్తు చేపడుతున్న చిన్నారి అస్వియా జాడ కాన రాలేదు పట్టణమంతా పోలీస్ అదుపులో ఉంచుకొని జల్లేడు పట్టి గాలింపు చర్యలు చేపడుతున్న పాపను గుర్తించలేకపోయారు స్థానిక మున్సిపల్ ఛైర్మన్ హాలీం భాష నేతృత్వంలో పట్టణ యూత్ మున్సిపల్ సిబ్బంది ద్వారా డాగ్ స్క్వాడ్ గుర్తించిన ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు అయినాను పాప జాడ కాన రాలేదు దీంతో చిన్నారి కుటుంబంలో మాత్రం విషాదఛాయలు అలుముకున్నాయి.





## కంచి బంధార్లపల్లి, పి.బి వాడ గ్రామాలలో పొలం పిలుస్తోంది

**గుడుపల్లి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం గుడిపల్లి మండలంలో కంచి బంధార్ల పల్లి, పి బి వాడ రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో, ఈ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించడం జరిగింది. ఇందులో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలసి పొలాలను సందర్శించి పంటలలో అనుసరించవలసిన నూతన ఆధునిక పద్ధతులు, తక్కువ పెట్టుబడి తో నాణ్యమైన అధిక దిగుబడిన పొందే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం,ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేస్తూ అందులో వాడే కషాయాలు, ద్రవ, ఘన జీవామృతం వాటి తయారీ పద్ధతులను, మట్టి నమూనా తీసే పద్ధతులు చేసి చూపించడం, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక శాఖ, మరియు రైతులకు సంబంధించిన ఇతర శాఖల ద్వారా అమలయ్యే పథకాలు, ఆ శాఖలలో ఉండేటటువంటి నూతన సాంకేతిక పద్ధతులు గురించి వివరించి, అవసరం అయినా ప్రతి ఒక్క రైతు కూడా డ్రిప్పులు, స్ప్రింకలర్స్ తీసుకోవాలని, అవసరమైన రైతులు పశువుల దాణా కూడా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు తెలియజేసి, రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు హాజరు కావడం జరిగింది.



# తిరుపతిని కాలుష్య రహిత నగరంగా చేస్తున్నాం

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**పరిసరాలు పరిశుభ్రత అందరి బాధ్యత**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మన పరిసరాలను, గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అందు కోసం ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వినాయక సాగర్ పరిసర ప్రాంతాలలో వాకర్స్ సహకారంతో పారిశుద్ధ్య



డ్రైవ్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 15 రోజులుగా నియోజకవర్గ పరిధిలో కలెక్టర్, కమిషనర్, పబ్లిక్ హెల్త్, యువత అందరు పాల్గొని తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో లక్షలాదిమంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శనార్థం వచ్చి వెళ్తుంటారన్నారు. ఇలాంటి జిల్లాలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతగా అధికారులదే కాదు, మన అందరిదీ అని ప్రతి ఒక్కరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు అన్ని రంగాల వారిని, స్టేక్ హోల్డర్స్‌ను భాగస్వామ్యులను చేసుకుంటూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో చాలా కార్యక్రమాలు నిర్వహించామని, అందులో భాగంగా ఈ రోజు మాస్ క్లీన్ నెస్ కార్యక్రమం వినాయక సాగర్ లో అన్ని భవన సముదాయాలను శుభ్రంచేయడం జరుగుతుందని తెలిపారు. రేపు ఉదయం 10.30 గంటలకు కచ్చపి ఆడిటోరియంలో స్వచ్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ రెండు వారాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందినవారికి అవార్డ్స్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న డీజీపీ తిరుమలరావు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ డిజిపి తిరుమలరావు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం విఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



## సీనియర్ సిటిజన్‌లు వారి సమస్యలపై కోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చు

**జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ లిఖిత**

**పలమనేరు, మేజర్‌న్యూస్:**

జూనియర్ సివిల్ కోర్టు నందు కోర్ట్ జడ్జ్ లిఖిత ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా వారి సమస్యల పట్ల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. జడ్జి లిఖిత మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ శ్రీనివాసరావు ఆదేశాలతో జూనియర్ సివిల్ కోర్టు నందు సీనియర్ సిటిజన్‌లకు అవగాహన సదస్సును న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా నిర్వహించామన్నారు. ఇంటి పెద్దలైన తల్లితండ్రులను వారి కుమారులు చూడకుండా ఇంటి నుండి వెలివేసిన వృద్ధాశ్రమంలో బలవంతంగా చేర్పించిన అలాంటి వాటిపై కోర్టులో నేరుగా వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే తగుచర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. పెన్షన్లు సక్రమంగా అందక పోయినా అలాంటి వాటిపై కూడా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. దీంతో సంబంధిత రెవెన్యూ శాఖకు గాని లేక మున్సిపాలిటీ అధికారులకు గాని లేక ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు గాని తెలిపి అలాంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఉంటే అలాంటి కుటుంబ సభ్యులపై కోర్టులో ఫిర్యాదు చేస్తే భార్యాభర్తల భరణం కేసులు ఎలా మెయింటినెన్స్ కింద నగదు అందించే విధంగా సీనియర్ సిటిజన్‌లకు సహాయ సహకారాలు అందించి న్యాయం చేస్తామన్నారు.



## వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, మేజర్‌న్యూస్:** వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు ఆలయ అర్చకులు. ఉదయం 6 నుండి 11 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా చేపట్టారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు,





ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడిగారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. ఏడాదిలో నాలుగు సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, ఉగాది, ఆణివార ఆస్థానం ముందు వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

# శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన భద్రతా

**డీజీపీ ద్వారక తిరుమలరావు**

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు మంగళవారం తిరుమలలో పర్యటించి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులతో గోకులం సమావేశ మందిరం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. డీజీపీ మీడియా మిత్రులతో మాట్లాడుతూ సామాన్య భక్తులకు పెద్దపీఠ వేస్తూ, సులభంగా శ్రీవారి వాహన సేవలో పాల్గొనే ఏర్పాట్లు చేసామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుండి గ్యాలరీలలోకి భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి క్యూలైన్ల ద్వారా అనుమతిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక బాలాజీ నగర్ వాసులు, అతిథిగృహాలు, మఠాలు, షాపులు యజమానులతో సమన్వయ సమావేశం నిర్వహించి, సహకరించాలని కోరామన్నారు. పాపిలాన్ డివైసెస్ ద్వారా వేలిముద్రలను తనిఖీ చేసి, పాత నేరస్తులు అనుమానితులను గుర్తించి, నేర నియంత్రణ చేస్తామన్నారు. గరుడ సేవ రోజున ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం అలిపిరి లింకు బస్సు స్టాండ్, పాత చెక్ పాయింట్, వినాయక నగర్ గ్రౌండ్ (ఇస్కాన్ గ్రౌండ్), నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాలు ఏర్పాటు చేసామన్నారు. గరుడ సేవ రోజున టూరిస్ట్ బస్సులు, టెంపో ట్రావెల్ వాహనాలు జూ పార్క్ రోడ్ నందు గల దేవలోక్ పార్కింగ్ ప్రాంతాన్ని.. ఫోర్ వీలర్‌లకు భారతీయ విద్యా భవన్ స్కూల్ గ్రౌండ్‌లలో క్యూఆర్ కోడ్ సహాయంతో పార్కింగ్ చేయాలన్నారు. సోషల్ మీడియాపై సైబర్ క్రైమ్ నిపుణులతో నిఘా పెట్టామని, ఏదైనా పుకార్లు, వదంతులు, అసత్య ప్రచారాలు చేసేవారిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సురక్షిత ప్రయాణానికి భక్తులు ప్రజా రవాణాను ఆదరించి, తిరుమలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ మేరకు అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి బాజ్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ శ్రీధర్, అదనపు ఎస్పీలు వెంకటరావు, రామకృష్ణ తిరుమల, శ్రీనివాసరావు ఏఆర్, డీఎస్పీలు, సిఐలు, టిటిడి విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.




**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

**వెంకటగిరి నియోజకవర్గం :**

1. డక్కిలి, 2.బాలాయపల్లి

**సత్యవేడు నియోజకవర్గం :**

1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం, 4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

**చంద్రగిరి నియోజకవర్గం :**

1.పాకాల, 2.చిన్న గొట్టికల్లు, 3.ఎర్రవారి పాలెం

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

# అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రం మరియు రాస్ వృద్ధాశ్రమంలోవద్ద అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ డాక్టర్లు ఆరోగ్య సమస్యలు మరియు మానసిక సమస్యల గురించి వివరించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు బి.పి, డయాబెటిక్, కంటిశుక్లం, క్యాన్సర్లు, ఎముకల అరుగుదల, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, స్త్రీ సంబంధ సమస్యలు మరియు ఎన్ సి డి గురించి వివరించడం జరిగింది. కొన్ని రక్త పరీక్షలను బి.పి. పరీక్షలను మరియు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, యూసఫ్, శృతి, కీర్తి, శృతి వైద్య సిబ్బంది, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ప్రత్యేక పూజలు



**కార్వేటి నగరం, మేజర్ న్యూస్:** నగరంలో వెలసిన గ్రామ దేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి, పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమ అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించి, రాహుకాలం పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీతే చెకుముకి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ, విజ్ఞాన సృజనాత్మ కతను వెలికితీయడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ను నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక జిల్లా నాయకులు ఎస్ఎం షరీఫ్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. జేవీవీ కార్యదర్శి బి. చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య సుధారాణి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేం క టేశ్వర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సుధారాణిని నియమిస్తూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉత్తర్వులు అందజేశారు. ఆచార్య సుధారాణి 1992లో వయోజన విద్యావిభాగంలో లెక్చరర్‌గా చేరారు. ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 32 సంవత్సరాల బోధనానుభవం గల వీరిని సీనియారిటీ ప్రాతిపదికన ప్రిన్సిపాల్ గా విశ్వవిద్యాలయ అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు.

# 2న మాంసం విక్రయాలు చేయరాదు

**- నగర పాలక సంస్థ కమీషనర్ నరసింహ ప్రసాద్**



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ బుధవారం నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం దుకాణాలు తెరవరాదని, విక్రయాలు జరపరాదని నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు మీరి నడుచుకునే వారి దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని మాంసం విక్రయదారులు, హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

# ఏర్పేడు మలయాళ స్వామితో రెడ్డి వారి గురవారెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఏర్పేడు ప్రసిద్ధ వ్యాసాశ్రయంలో మలయాళ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వాములవారిని కలిసిన సందర్భంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి శాలువాతో సత్కరించి వారు ఆశీస్సులు అందించి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి. మండల యువత అధ్యక్షులు గుణ యాదవ్. పార్లమెంటు ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రమణ. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు

**- పేద వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు, వీల్ చైర్స్ వితరణ**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** రాస్ కార్యాలయంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం జి.రాంప్రసాద్, రాస్ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.వెంకటరత్నం హాజరై వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్స్ అరణి మాట్లాడుతూ వయోవృద్ధుల రాస్ చేస్తున్న సేవలు బహు ఆదర్శనీయమని కొనియాడారు. యోగ, నడక ద్వారా వృద్ధులు మానసిక ప్రశాంతతను అలవర్చుకుని కుటుంబంలో పెద్దదిక్కుగా వ్యవహరించాలన కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం జి.రాంప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, రాస్ సంఘాలు చక్కటి ఆర్థిక క్రమశిక్షణను కలిగి ఉన్నారని ప్రశంసలతో లాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వాల సహకారంతో 40 ఏళ్లుకు పైగా వృద్ధులకు వివిధ రకాల సేవలందిస్తున్నామని. హెల్ప్ ఏజ్ ఇండియా వారి సహకారంతో వృద్ధుల సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థిక సహకారం అందించి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా సహకారం అందిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా వృద్ధుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యాంతం అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పేద వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు ట్రై సైకిల్స్, వీర్ చైర్స్, వినికిడి పరికరాలు, బియ్యం అందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున 300 మంది వృద్ధులకు 50 వేలు విలువ చేసే స్టీల్ ప్లేట్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి ఎం.మమత, యూనియన్ ట్యాంక్ మేనేజర్ మొగిలేశ్వర్, రాస్ సిబ్బంది వి.నాగరాజు, యువరాజు, బాలాజీ, షద్రిక్, కరుణాకర్ పాల్గొన్నారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రతిభ

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** చెకుముకి టాలెంట్ పరీక్షల్లో మండల స్థాయిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రతిభ కనబరిచినట్లు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి దేవి కార్వేటి నగరం బాలికల ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో మంగళవారం ఈ టెస్ట్ కు ప్రభుత్వ పాఠశాలల నుండి పది పాఠశాలలు, ప్రైవేటు పాఠశాల నుండి రెండు పాఠశాలలు మండల స్థాయి పోటీల నందు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమము బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయ త్రీ దేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ జన విజ్ఞాన వేదిక పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మూఢన మ్మకాలను రూపుమాపుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న చేతబడి, బాణామతి, లాంటి అనేక మూఢనమ్మకాలను రూపుమాపుతూ విద్యా



ర్థులకు సైన్స్ పట్ల మక్కువ కల్పిస్తూ, పిల్లలను చిన్నతనం నుండే శాస్త్ర వేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు అందిస్తూ కృషి చేస్తున్నదని తెలి యజేశారు. ఈ కార్యక్రమం నిర్వహించేటటువంటి జన విజ్ఞాన వేదిక కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ చిన్నతనం నుండి పిల్లల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రజలలో నాటుకోబడిన మూఢనమ్మ కాలను తొలగించడానికి జన విజ్ఞాన వేదిక సంస్థ గత 34 సంవత్స రాలుగా చిత్తూరు జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ ఉన్నది అని తెలియజేశారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలల నుండి పాల్గొన్న పది పాఠశాలలో మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కత్తిరిపల్లి విద్యార్థులు, ద్వితీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల కేఎం పురం, తృతీయ స్థానంలో ఆర్ కే ఎస్ ఆర్ గవర్నమెంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు పొందడం జరిగినది. అలాగే ప్రైవేటు పాఠశాలల నుంచి పాల్గొన్నటువంటి శ్రీ లక్ష్మీ నరసిం హ ఉన్నత పాఠశాల విద్యార్థులు, శ్రీ స్వామి వివేకానంద పాఠశాల కత్తింపల్లి వారు విజేతలుగా నిలిచిరి... విజేతలుగా నిలిచిన వారం దరికీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయత్రీ దేవి ప్రశంసా పత్రములు బహుమతులను ప్రధానం చేసిరి. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శేఖర్, రమణ, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, భారతి, వరలక్ష్మి రెడ్డమ్మ, బంగారమ్మ, లీనాకుమారి, తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశిక్షణ సంస్థ డైట్‌లో సారంగపాణి పద కవితపై అవగాహన

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరంలో కొలువున్న శ్రీ వేణుగోపాల స్వామి వారిని ఆరాధించిన పరమ భక్తుడు, వాగ్గేయకార శిరోమణి శ్రీ సారంగపాణి పద రచనలతో, సంగీత సాహితీ చంద్ర శ్రీ సాయి కృష్ణ యాచేంద్ర సంగీత సాహిత్య గేయధార మరియు భూమన్‌చే శ్రీ సారంగపాణి పదపరిచయ కార్యక్రమం శ్రీ సారంగపాణి విద్యాపీఠం, కార్వేటి నగరం వారి ఆధ్వర్యంలో నేడు కార్వేటినగరంలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) సరస్వతి ఆడిటోరియం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీత సాహితీ రత్న బిరుదాంకితులు వెంకటేశ్వర భక్తి ఛానల్, తిరుపతి పూర్వ అధ్యక్షులు, పూర్వ శాశన సభ్యులు వెలుగోటి వంశోద్ధారకుడు డా భాస్కర సాయికృష్ణ యాచేంద్ర సంగీత సాహిత్య గేయ ధారను నడిపించారు. ఈ కార్యక్రమాన్ని చెన్నై, ఐకాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్ వేర్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్, సంగీత సాహిత్య తెలుగు భాషాభిమాని. శోభరాజు నిర్వహించగా శతావధాన చక్రవర్తి, రచయిత, వక్త, ఆధ్యాత్మిక వేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు కో ఆర్డినేటర్ ఫర్ సారంగపాణి ప్రాజెక్ట్ డా ఆముదాల మురళి సంచాలకులుగా మరియు వస్తు నిర్దేశం అంశానికి పృచ్ఛకులుగా వ్యవహరించారు. శ్వేత పూర్వ డైరెక్టర్, వెంగమాంబ ప్రాజెక్ట్, సారంగపాణి ప్రాజెక్ట్ టి.టి.డి, తిరుపతి భూమన్ సారంగపాణి పదపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విశిష్టమైన సంగీతావధాన కార్యక్రమంలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సర్ ఆచార్య పి కుసుమ కుమారి, యువ ప్రవచనకర్త, వైణికులు ఆదిత్య శర్మ, శోభ రాజు, తదితరులు పృచ్ఛకులుగా వ్యవహరించి కార్యక్రమాన్ని రంజింపజేశారు. హంస ధ్వని బాబు రాగ, తాళ నిర్దేశం చేయగా చివరలోకర్ణాటక సంగీత గాత్ర కళాకారులు డా టి. లీలా మనోహర్ రెడ్డి, సారంగపాణి రచించిన కృతులను వినిపించి ప్రేక్షకులను మైమరిపించారు. తదుపరి సంగీత సాహిత్య గేయ ధార నిర్వహించిన వారిని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు, గ్లోబల్ క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శంకర్ రాజు, కార్వేటినగరం గ్రామ సర్పంచ్ ధనంజయ వర్మ, టీ. కె. ఎం. పేట మాజీ సర్పంచి పురుషోత్తమ రాజు, కార్వేటినగరం పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు శ్రీ విజయ కుమార్ పిళ్ళై , డైట్ లెక్చరర్ బి చెంగల్ రాజు తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీ లక్ష్మీనరసింహ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ ప్లస్ మరియు డైట్ చాత్రోపాధ్యాయులు, గ్రామస్తులు పలువురు విద్యావేత్తలు, కార్వేటి నగరం గ్రామస్తులు పాల్గొన్నారు.





## 16వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 6గంటలకే 16వ డివిజన్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆనంద్‌బాబు యాదవ్, వెంకటరత్నం శ్రీనివాసులు లీలా కృష్ణ ఉమామహేశ్వర్ రెడ్డి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం షాపులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



**వాకాడు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీ గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. వాకాడులోని ఎక్సైజ్ కార్యాలయంలోని మంగళవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నూతన మద్యం పాలసీ విధానంలో దరఖాస్తు దారుడు దరఖాస్తు చేసుకోవడానికి నేటి నుండి 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్లైన్లో అప్లికేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అఫ్‌లైన్‌లో 2 లక్షల రూపాయల డీడీతో దరఖాస్తు స్వీకరించబడుతుందని, వాటిని ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా ఓపెన్ చేస్తారని 12వ తేదీ నుండి షాప్ ఓపెన్ చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేయుట కొరకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, 2 పాస్ ఫోటోలు, రెసిడెన్సీ ప్రూఫ్, బ్యాంకు పుస్తకం, మొబైల్ నెంబర్ తీసుకురావాలన్నారు. వాకాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కోట వాకాడు చిట్టమూరు మండలాలు ఉన్నాయన్నారు.

## వృద్ధులు ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలి




**చిత్తూర్ అర్బన్, మేజర్‌న్యూస్:** వృద్ధులు తమ ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి తెలిపారు. మంగళవారం చిత్తూరు నగర పరిధిలోని టెలిఫోన్ కాలనీ నందు గల అర్బన్ హెల్త్ సెంటర్ నందు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎంహెచ్వో ఓ ప్రభావతి దేవి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు వస్తూ వుంటాయని ఎప్పటికప్పుడు తొలి దశలో వాటిని గుర్తించి చికిత్స తీసుకోవాలి అన్నారు. ప్రధానంగా కంటి చూపు తగ్గిపోవడం,చెవులు వినపడక పోవడం, అలెర్జీలు, దంతాలు రాలి పోవడం, మతి మరుపు,మోకాళ్ల నొప్పులు, మోకాలి చిప్పలు అరిగి పోవడం, పోషకాహార లేమి,రక్తహీనత, మధుమేహం, రక్తపోటు, కాన్సర్, గుండె జబ్బులువంటివి సాధారణంగా వస్తూ ఉంటాయి.

శుక్లము కంటి ఆపరేషన్ సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. సరైన నిద్ర, ఏలాంటి ఆలోచనలు లేకుండా మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం, ఆహారం, వాకింగ్,యోగ,ఆసనాలు క్రమం తప్పకుండా పాటిస్తే జీవితకాలం పొడిగించుకుని సంతోషంగా జీవించవచ్చని తెలిపారు. వృద్దులకు సామాజిక భద్రత పెన్షన్ కూడా ప్రభుత్వం ప్రతి నెల ఇంటి వద్దకే అందిస్తున్నది.అనంతరం వృద్దులకు బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 60 సం పైబడిన వారికి బి.సి.జి.టీకాలు వేయడం జరిగింది. సాధారణ జబ్బులకు మందులు పంపిణీ చేశారు. మంచి పౌష్టికాహారం, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, తగినన్ని నీళ్లు రోజుకు నాలుగు లీటర్లు, మంచి నిద్ర,వాకింగ్,యోగా, ఆసనాలు చేసుకుంటూ ఆరోగ్య జీవితం గడపాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శిరీష, శ్రీవాణి, డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలను నాటండి పర్యావరణాన్ని కాపాడండి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు చెట్టును నాటి పర్యావరణాన్ని కాపాడాలని కళాశాల ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా మంగళవారం ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒక చెట్టు తల్లి పేరుతో ఎన్సిసి క్యాండెట్లు చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం, ఎన్సీసీ కేడెట్స్ తమ తల్లితో కలిసి, తాము చదువుతున్న కళాశాలలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని విస్తరించడమే కాకుండా, తల్లుల పట్ల తమ కృతజ్ఞతను కూడా వ్యక్తపరుస్తున్నారు. ప్రతి మొక్క తల్లి ప్రేమకు ప్రతీకగా పెంచి, సంరక్షణ చేయాలని కేడెట్స్ కృత నిశ్చయంతో ముందుకెళ్తున్నారు. ఎన్సీసీ కేడెట్స్ చేపట్టిన ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో వారి బాధ్యతను నిలిపే ఉదాహరణగా నిలిచింది. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా సర్వసాధారణ కర్తవ్యం అని వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ వి ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి శ్రీవెంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు ఎన్ సిసి క్యాడెట్లచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఉదయ్ కుమార్, ఎన్సీసీ బృందం, మేజర్ లోగనాథన్, బి గోవిందరావు, జి బాలకృష్ణ, బావాజీ, శ్రీధర్, అజయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల జోలికి వస్తే జైలుకు పోవడం ఖాయం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం శ్రీకాళహస్తి రెవెన్యూ సర్వే నెంబర్ 360/2 లో రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి. ఈ భూమిలో ఎవ్వరు అడుగుపెట్టిన జైలుకు పోవడం ఖాయమని శ్రీకాళహస్తి తహసిల్దార్ లక్ష్మీ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది కబ్జాదారులు అధికార పార్టీ రాజకీయ నాయకులు పేరు చెప్పి విలువైన ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిచ్చా టూర్ రోడ్ పక్కన సర్వే నెంబర్ 360/2లో రెండు ఎకారములు ప్రభుత్వ భూమి ఈరోజు కొంతమంది కబ్జాదారులు జెసిబితో చదును చేశారు. వారిపై ల్యాండ్ గ్లబ్లింగ్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## కొత్త జీఓ ప్రకారం మద్యం షాపులకు దరకాస్తు చేసుకోండి: కలెక్టర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** మద్యం షాపుల కొత్త విధానాలపై తిరుపతి కలెక్టర్ డా.వెంకటేశ్వర్ మంగళవారం విలేకరుల సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 211 ఎక్సైజ్ గైడ్లైన్స్ ప్రకారం జిల్లాలో 227 మద్యం షాపులు ఉన్నట్లు తెలిపారు అవి కాకుండా గీత కార్మికులకు మరిన్ని షాపులు వచ్చే విధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ జీఓ ప్రకారం 12-10-2024 నుంచి 11-10 -2026 వరకు అంటే రెండు సంవత్సరాల కాల పరిమితితో కొత్త షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు, ఒక్కొక్క దరఖాస్తు రెండు లక్షల రూపాయలు చొప్పున మూడు పద్ధతుల్లో అప్లై చేసుకోవచ్చని ఆన్లైన్ మోడ్, ఆఫ్లైన్ మోడ్, హైబ్రిడ్ మోడ్ ఈ పద్ధతుల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు, ఈ నెల 1 నుంచి ఈనెల 9వ తేదీ సాయంకాలం 5గంటలకు వరకు మూడు పద్ధతుల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తామని కలెక్టర్లు తెలిపారు ఈ వచ్చిన అర్జీలను పరిశీలించి ఈనెల 11న ఉదయం 8 గంటలకు తిరుచానూరులోని శిల్పారామం కళాక్షేత్రంలో అందరి సమక్షంలో లాటరీ పద్ధతులు డిప్స్ తీయబతుందని తెలిపారు. 10వేలు లోపల జనాభా కలిగిన షాపులకు మొదటి సంవత్సరానికి రూ.50లక్షలు, రెండో సంవత్సరానికి రూ,55.50 లక్షలు, 10 నుంచి 15 వేల జనాభా కలిగిన షాపులకు మొదటి సంవత్సరం రూ.55 లక్షలు, రెండో సంవత్సరం రూ.60.50లక్షలు, 5లక్షల లోపు జనాభా కలిగిన ప్రాంతాల్లో మొదటి సంవత్సరం రూ.65లక్షలు, రెండవ సంవత్సరం రూ.71.5లక్షలు, 5 లక్షలు పైబడిన జనాభా కలిగిన ప్రాంతాల్లో మొదటి సంవత్సరం రూ.85లక్షలు, రెండవ సంవత్సరం రూ.93.5లక్షలు లెక్కన 6 వాయిదాల పద్ధతుల్లో ప్రభుత్వానికి కట్టాలని తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రామచంద్రాపురం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం శిక్షణా సమన్వయకర్త ఏడిఏ భాస్కరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కుప్పం బాదూరు రైతు సేవా కేంద్ర ఆవరణలో రైతులకు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు విపరీతంగా వాడడం వలన భూమి నిస్సారమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఘన, ద్రవ, జీవామృతాలతో పాటు ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టడం వలన భూమికి జీవం పోయవచ్చు అని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వలన మొక్కలకు అందాల్సిన పోషక విలువలు వృద్ధి చెంది అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనానికి ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు ప్రాంతీయ పరిశోధనా సంస్థ తిరుపతి శాస్త్రవేత్త వజిత, ప్రకృతి వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్ జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సుమాంజలి, ఎన్ఎఫ్ఏ నీలమ్మ, ఎంటీ రంగయ్య ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగను తలపించిన పింఛన్ పంపిణీ

**ఓజిలి, మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం చిలామను చేను గ్రామంలో తెదేపా నాయకులు మధు శేఖర్ రాజు ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం పండుగను తలపించింది. సచివాలయ సిబ్బందితో కలిసి నేరుగా పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెరిగిన పింఛన్లు ఆయన చేతుల మీదగా వృద్ధులకు, వికలాంగులకు ,వితంతువులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశ పెట్టారని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదల అభివృద్ధి కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంచిన ఘనత కూడా నారా చంద్రబాబు నాయుడు దేనని ఆమె తెలిపారు .కుటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలనలో రాష్ట్రం దినదిన అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ హిందూ వాహిని అధికార ప్రతినిధిగా రాజు

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** తిరుపతి, అక్టోబర్ 1బీ భారతదేశంలో హిందూ సనాతన ధర్మ వ్యాప్తికి జాతీయ హిందూ వాహిని సంఘటన్ సంస్థ విశేషంగా కృషి చేస్తుందని ఆ సంస్థ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ ఇంచార్జ్ కృష్ణ కిషోర్‌లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా నందిపేట్ లోని కేదారేశ్వర ఆశ్రమంలో జరిగిన జాతీయ మహాసభల సందర్భంగా వారు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తిరుపతికి చెందిన సుకుమార్ రాజును వారు ప్రకటించారు రెండు రోజులపాటు జరిగిన ఈ మహాసభలలో 22 రాష్ట్రాలకు చెందిన జాతీయ హిందూ వాహిని సంఘటన్ ప్రతినిధులు హాజరయ్యారు పలువురు పీఠాధిపతులు సాధు పొంగవులు హాజరై ప్రసంగిస్తూ హిందూ దేశ ఆధ్యాత్మికతను విశ్వవ్యాప్తం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు భారత దేశంలో సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఇందుకు ప్రతి హిందువు కంకణ బద్ధులై కృషి చేయాలి అన్నారు భవిష్యత్తు తరాల అభివృద్ధికి భారతదేశ ఔన్నత్యానికి సనాతన ధర్మ వ్యాప్తికి హిందూ భావ జాలాలను ప్రతి ఇంటి గడపకు చేరేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి రాములు మహారాజ్ ఆతిథ్యమిచ్చి జాతీయ హిందూ వాహిని సంఘటన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు పలు రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులను అధికార ప్రతినిధులను నియమించారు దక్షిణ భారతదేశంలో సనాతన ధర్మ వ్యాప్తికి ప్రతి భారతీయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు దేశవ్యాప్తంగా రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ఆధ్వర్యంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను సనాతన ధర్మ వ్యాప్తికి ప్రణాళికబద్ధంగా వ్యవహరించి కృషి చేయనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి సుకుమార్ రాజు ప్రకటించారు జిల్లాల వారీగా త్వరగా కమిటీలను నియమించనున్నట్లు వారి పేర్కొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం దసరా గోడ పత్రికలు ఆవిష్కరణ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈనెల మూడవ తేదీ నుంచి జరగబోవు దేవీ నవ రాత్రి బ్రహ్మోత్సవాలు గోడ పత్రికలను శ్రీ మేధా గురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద ఉంచి విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించిన అనంతరం ఆలయ అధికారులు గోడపత్రికలను ఆవిష్కరించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలు



భక్తులకు ఇటువంటి ఇబ్బందులకు లేకుండా అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏ.ఈఓ లోకేష్ రెడ్డి, ఏఈఓ హేమామాలీని. సూపర్డెంట్ రవి,ప్రధాన అర్చక కరుణాకర్ గురుకుల్. దేవస్థానం సూపర్డెంట్ అండ్ సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్.ఆలయ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

**- తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు జి విజయ్ కుమార్**



శ్రీకాళహస్తి మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ,శ్రీకాళహస్తి శ్యాసన సభ్యులు బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి సూచనలు మేరకు శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ ఉదయం 5:30 గంటలకు ఎన్టీఆర్ భరోసా ఇంటివద్దకే పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణం 19 వార్డులో పెన్షన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గాదిపాకుల గోపీనాథ్. కృష్ణ. నాయకులు కార్యకర్తలు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో మండలంలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేకల చిన్నేపల్లి విద్యార్థులు. వీరికి మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి చేతుల మీదుగా మెమెంటో మరియు సర్టిఫికెట్లను బహూకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన



వేదిక జిల్లా సభ్యులు వేణుగోపాల్ మరియు సైన్సు ఉపాధ్యాయులు లింగమూర్తి ,డి నారాయణ, మధుసూదన్ రావు పాల్గొనడం జరిగినది.

## మున్సిపల్ కమిషనర్‌కి ముక్కంటి ప్రసాదాలు



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** శ్రీకాళహస్తి పట్టణం మున్సిపాలిటీ కమిషనర్ గిరి కుమార్ ని శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలు వాలతో ఘనంగా సన్మానించి ,ముక్కంటి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు తక్కలపాటి ప్రకాష్ నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, గోగినేని సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఫోటో శ్రీకాళహస్తి కమిషనర్ తో తెలుగుదేశం నేతలు

## వాకాడు, గొల్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**వాకాడు మేజర్ న్యూస్ :** వాకాడు గొల్లపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారిని దీపా ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడిలో తగు సలహాలు సూచనలు అందజేశారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరు సుధాకర్ రెడ్డి, వెటర్నరీ ఏ డి వెంకటరమణ, నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన జాతీయ సదస్సు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ట్రాన్సలేషన్ టెక్నిక్స్ అండ్ చాలెంజస్ అనే అంశంపై జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు చేపట్టిన జాతీయ సదస్సు మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.రాణీ సదాశివమూర్తి విచ్చేసి, అనువాదం మహత్యం, అనువాదం చేయడానికి కావలసిన పద్ధతులను తెలియజేశారు. అనువాద ప్రక్రియకు అవసరమైన భాషా పరిజ్ఞానం, కొన్ని రకాల సాహిత్య ప్రక్రియలో అంశాలను ఏ విధంగా ఇతర భాషల్లోకి ఆ భాషలలో ఉన్న సౌందర్యాన్ని ఉట్టిపడేలా అనువాదం ఏవిధంగా చేయాలో అనే అంశంపై విశ్వవిద్యాలయంలో అనువాద విభాగం ద్వారా చేస్తున్న విధానాలను వివరించారు. ఇందుకోసం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 24 విభాగాలు ఉన్నాయని, ఆ విభాగాలు అన్నీ కూడా అనువాద విభాగంతో పరస్పర సంబంధం గలిగి బహుముఖ అనువాదకార్యాలు, వివిధ విషయాలలో చేసినట్లయితే చక్కటి పురోగతి సాధిస్తున్నాయన్నారు. అనువాదం జ్ఞానాన్ని ఇతరులకు అందించే ఒక గొప్ప సాధన తెలియజేశారు. విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ప్రొ.ఆర్జే రమాశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మిషన్ ఏ విధంగా ప్రజలు ఉపయోగించి సరైన జ్ఞానాన్ని



పొందలేకపోతున్నారో అనే అంశాన్ని న్యాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ అనే విధానాన్ని వివరించారు. మానవుల మేధోశక్తితోనే ఉత్తమ అనువాదాలు చెయ్యవచ్చున్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ నుండి విచ్చేసినటువంటి తెలుగు విభాగం ఆచార్యురాలు ప్రొ.డి విజయలక్ష్మి మాట్లాడుతూ జానపద సాహిత్యం ఏదైతే ఉందో దాన్ని ఆధునిక తరానికి వివిధ భాషల్లో ఏవిధంగా అనువదించాలి? ఆ జానపద సాహిత్యం ద్వారా సామాన్య ప్రజలకు ఏ విధమైన జ్ఞానాన్ని మనం అందించవచ్చు అనే అంశాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శుక్లా, సాహిత్య విభాగం వరిష్టాచార్యులు ప్రొ. సత్యనారాయణాచార్యఈ సదస్సు కోఆర్డినేటర్స్ డా.ఎమ్.జి.నందన రావు, డా.కనపాల కుమార్, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో విద్యార్థులకు పోటీలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంగా గత నెల 21 నుంచి ఈనెల 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా మంగళవారం మహిళ వర్సిటీలోని హ్యుమానిటీ బ్లాక్ లోని సెమినార్ హాల్ నందు వకృత్వ, వ్యాపార



ఆలోచన మరియు పోస్టర్ తయారీ వంటి పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా, మండల, పంచాయతీ స్థాయిలలో ప్రణాళికలు ద్వార సామాజిక, ఆర్థిక అభివృద్ధి, మహిళాభివృద్ధి, ఆరోగ్యము, పరిసరాలు, పరిశుభ్రత ఉత్తమ విద్య తదితర ప్రధాన అంశములను ఆధారంగా చేసుకుని ఈ పోటీలను నిర్వహించారు.

విద్యార్థులు నైపుణ్యములను, సృజనాత్మకతను ప్రదర్శించారు. ఇందుకు న్యాయ నిర్ణీతగా ఐఐటి లోని ఆడిటర్ గా పనిచేస్తున్న శివ శంకర్, కన్సల్టెంట్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ హరిపద్మరాణి, ప్రొఫెసర్ శోభ, ప్రొఫెసర్ చండీ, లతా అసిస్టెంట్ ప్రొఫెసర్ వ్యవహరించారు.

విజేతలకు బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలను డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్.జె. కాత్యాయని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమెన్ స్టడీ సెంటర్ డాక్టర్.కే.రాణి అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రాజెక్టు అసిస్టెంట్స్ ప్రీతి, ఇంద్రాణి సహాయ సహకారాలు అందించారు.

## ప్రజల మెచ్చిన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు

**- సులూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ**

**ఓజిలి, మేజర్ న్యూస్:** ప్రజలు మెచ్చిన నాయకుడు ఇచ్చిన మాటకి కట్టుబడి, సూపర్ సిక్స్ పథకాలను తూచా తప్పకుండా నెరవేర్చే వ్యక్తి చంద్రబాబు నాయుడు అని సులూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఓజిలి మండలంలోని రాచపాలెం గ్రామంలో మంగళవారం నాడు తెదేపా మండల కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు అధ్యక్షతన స్థానిక నాయకులు తిరుపతి పార్లమెంట్ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్.ఖలీల్ బాషా , తేదేపా సీనియర్ నాయకులు అర్జున్ రాజు ఆధ్వర్యంలో సులూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం చేతుల మీదగా గ్రామస్తులకు పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో 17 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పింఛన్లు ప్రతి ఒక్కరికి ఒకటో తారీఖున అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు చూసేందుకు దీపావళి నుంచి ఉచితంగా సిలిండర్లను అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ



దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అంటేనే పేదల పక్షపాతి అని నిత్యం ప్రజలతో మమేకమై వారి వెంట నడుచుకుంటూ సమస్యలను పరిష్కరిస్తూ నడవడమే ముఖ్య దయ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్ ,కుందాం మాజీ సొసైటీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కంకణాల సత్యవర ప్రసాద్ నాయుడు, నాయకులు ధనుంజయ రెడ్డి, నారాయణరెడ్డి, ఈశ్వర్ రాజు, మల్లికార్జున్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఫ్రాంక్లిన్, సుబ్రహ్మణ్యం రాజు, మన్మధరావు, కోటి, పురుషోత్తం రాజు, డాక్టర్ అంకయ్య, శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీవో రజనీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బందిల సంధ్య, ఎస్సై స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్య మతస్తులు వెంకటేశ్వర స్వామి దర్శనానికి డిక్లరేషన్ సమర్పించాలి

**- మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు**

**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** అన్యమతస్తులు తిరుమల తిరుపతి దేవస్థానం నందుగల కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ సమర్పించాలని మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజసింహులు మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి దర్శనానికి సుప్రీం కోర్టు జడ్జి చంద్ర చూడ్ సహితం సమర్పించారని, మాజీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన జగన్ మోహన్ రెడ్డి డిక్లరేషన్ ని సమర్పించడానికి వెనకాడడం విడ్డూరంగా ఉందన్నారు. సనాతన ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో జంతు అవశేషాలతో తయారుచేసిన నెయ్యిని వినియోగించడం దురదృష్టకరం అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు పల్లెంటి సునీల్ కుమార్, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి గోపాల్, ఇతర టిడిపినాయకులు పాల్గొన్నారు.